


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 269, పేజీలు - 08

మంగళవారం, మార్చి 17, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




# హైడ్రా ద్వారా 60 వేల కోట్ల ఆస్తులు కాపాడాం

## అసెంబ్లీలో తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా

- విజన్ 2047 ద్వారా 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు రోడ్ మ్యాప్ రూపొందించాం
- రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4.18 లక్షలకు చేరిందని ప్రకటన
- మహాలక్ష్మి పథకంతో రూ.9,222 కోట్లు ఆదా అయ్యాయని వెల్లడి

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రైజింగ్ విజన్ ద్వారా 2047 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలనే ప్రతిష్ఠాత్మక లక్ష్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించుకుందన్నారు గవర్నర్ శివప్రతాప్ శుక్లా. హైడ్రా ద్వారా రూ. 60వేల కోట్ల ప్రభుత్వ ఆస్తులను కాపాడామని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన కీలక రోడ్ మ్యాప్‌ను ఆయన ఆవిష్కరించారు. తెలంగాణ బడ్జెట్ సమావేశాలు గవర్నర్ శివప్రతాప్ శుక్లా స్పీచ్‌తో సోమవారం నాడు ప్రారంభమయ్యాయి. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగిస్తూ, తెలంగాణ రాష్ట్ర ఒక చారిత్రాత్మక పరివర్తన దశలో ఉందని, పరిపాలనతో పాటు రాష్ట్ర భవిష్యత్తును అత్యున్నత స్థాయికి తీసుకెళ్లడం ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలో కొత్తగా 15.12లక్షల రేషన్ కార్డులు లబ్దిదారులకు ఇచ్చామన్నారు. 3.38 కోట్ల మందికి సన్న బియ్యం అందిస్తున్న ఏకైక ప్రభుత్వం తమదన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు రూ.9,222 కోట్లు ఆదా చేసినట్లు తెలిపారు. ఎస్‌హెచ్‌జీలకు రూ.లక్ష కోట్ల రుణాలు అందించేందుకు చర్యలు చేపట్టినట్లు గవర్నర్ వెల్లడించారు.

### క్యూర్ - ప్యూర్ - రేర్.. తెలంగాణ అభివృద్ధి నమూనా

రాష్ట్రమంతటా సమగ్ర అభివృద్ధిని సాధించడానికి ప్రభుత్వం క్యూర్ – ప్యూర్ – రేర్ అనే వ్యూహాన్ని అమలు చేస్తోంది.క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ): హైదరాబాద్ ప్రధాన పట్టణ ప్రాంతాన్ని గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దడం.ప్యూర్ (పెరి–అర్బన్ రీజియన్ ఎకానమీ): ఔటర్ రింగ్ రోడ్డు మరియు రీజినల్ రింగ్ రోడ్డు మధ్య ప్రాంతాన్ని తయారీ మరియు లాజిస్టిక్స్ ఇంజిన్‌గా మార్చడం.



రేర్ (రురల్ అగ్రికల్చర్ ఒ రేసైలెన్స్ ఎకానమీ): గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్ మరియు పర్యావరణ పర్యాటకాన్ని ప్రోత్సహించడం.

### ఇందిరా మహిళా శక్తి స్కీమ్

'తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇందిరా మహిళా శక్తి' పథకం కేవలం ఒక సంక్షేమ కార్యక్రమం మాత్రమే కాదు, మహిళా సాధికారతకు ఒక సామాజిక విప్లవం. వచ్చే మూడేళ్లలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మార్చడమే ఈ పథకం లక్ష్యం. ఇందుకోసం ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో రూ. 1,00,000 కోట్లను సమీకరించి,

2లో..

# మమత వర్సస్ సువేందు

## - దీదీ కంచుకోట బద్దలు



కోల్కతా (ప్రశ్న న్యూస్) బెంగాల్ లో ఎన్నికల నగారా మోగింది. ఎలక్షన్ కమిషన్ ఎన్నికల తేదీని ప్రకటించిన మరుసటి రోజే బీజేపీ అభ్యర్థుల తొలి జాబితాను రిలీజ్ చేసింది. 144 మంది అభ్యర్థులతో కూడిన మొదటి జాబితాను ప్రకటించింది. ఈ మేరకు ఉత్తర, దక్షిణ బెంగాల్ లోని పలు కీలక నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. ఇక పశ్చిమ్ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ నియోజకవర్గం అయిన భవానీ పూర్ నుంచి రాష్ట్ర ప్రతిపక్షనేత సువేంధు అధికారి పోటీ చేయనున్నారు. దీంతో రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి.

బెంగాల్ లో అసెంబ్లీ ఎన్నికల హీట్ అప్పుడే మొదలైంది. మార్చి 15 న బెంగాల్, కేరళ, తమిళనాడు, అసోం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల తేదీలను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన

2లో..

# జగిత్యాలలో రాజకీయ ప్రకంపనలు!

- 40 ఏళ్ల కాంగ్రెస్ బంధానికి జీవన్ రెడ్డి గుడ్‌బై?
- కారు ఎక్కనున్న సీనియర్ నేత!



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాజకీయాల్లో అత్యంత సీనియర్ నేతగా, ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజకీయాల్లో చెరగని ముద్రవేసుకున్న మాజీ మంత్రి టీ. జీవన్ రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. గత నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీకి వెన్నెముకలా నిలిచిన ఆయన, ఇప్పుడు ఆ పార్టీకి చేయి ఇచ్చి బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకోవడానికి సిద్ధమైనట్టు తెలుస్తోంది. ఈ పరిణామం జగిత్యాల జిల్లాలోనే కాకుండా ఉత్తర తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది.

### -40 ఏళ్ల అనుబంధం - అగాధంగా మారిన అసంతృప్తి

టీ. జీవన్ రెడ్డి అంటేనే కాంగ్రెస్, కాంగ్రెస్ అంటేనే జీవన్ రెడ్డి అనే రీతిలో జగిత్యాల నియోజకవర్గంలో రాజకీయం సాగింది. అయితే, గత కొంత కాలంగా పార్టీ అంతర్గత పరిణామాలు ఆయనను తీవ్రంగా కలిచి వేస్తున్నాయి. ముఖ్యంగా రెండేళ్ల క్రితం బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లోకి చేరిన ప్రస్తుత జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌తో జీవన్ రెడ్డికి పొసగడం లేదు. పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు జెండా మోసిన తనకు కాకుండా, పక్క పార్టీ నుంచి వచ్చిన వారికి అధిష్ఠానం ప్రాధాన్యత ఇవ్వడంపై ఆయన తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. జగిత్యాల మున్సిపల్ ఎన్నికల సమయంలో టికెట్ల కేటాయింపు నుంచి చైర్‌పర్సన్ పదవి వరకు అన్ని నిర్ణయాల్లోనూ సంజయ్ కుమార్ వర్గానికి పెద్ద పీట వేశారని, దీని వల్ల జీవన్ రెడ్డికి పార్టీలో ప్రాధాన్య తగ్గుతూ వచ్చిందని ఆయన అనుచరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తను కాదని సంజయ్ కుమార్‌కు నియోజకవర్గ పగ్గాలు అప్పగించడం, స్థానిక నిర్ణయాల్లో తన ప్రమేయం

2లో..

# ముస్లింల అభివృద్ధి, సంక్షేమమే మా లక్ష్యం

## - ఇఫ్తార్ విందులో సీఎం చంద్రబాబు



అమరావతి (ప్రశ్న న్యూస్) విజయవాడలో సోమవారం ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో కఠోర ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లిం సోదరులందరికీ ఆయన రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ముస్లింలను ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి పథంలో నడిపించడమే తమ కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. పేదలకు సాయం చేయడమే ఖురాన్ ప్రవచించిన గొప్ప సూక్తి అని, మహ్మద్ ప్రవక్త బోధనలను స్ఫూర్తిగా తీసుకుని

2లో..

# త్యాగమూర్తి విగ్రహం 'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్'గా నిలుస్తుంది

- పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఆవిష్కరించిన చంద్రబాబు

అమరావతి (ప్రశ్న న్యూస్) తెలుగు జాతి ఆత్మగౌరవం కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో నవ్యాంధ్ర ప్రదేశ్ రాజధాని అమరావతిని ప్రపంచస్థాయిలో నిర్మించి తీరుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణమైన పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా, ఆయన 58 రోజుల నిరాహారదీక్షకు గుర్తుగా అమరావతిలోని శాఖమూరు పార్కులో ఏర్పాటు చేసిన 58 అడుగుల భారీ విగ్రహాన్ని చంద్రబాబు సోమవారం ఆవిష్కరించారు. ఈ విగ్రహానికి 'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్' (త్యాగనిరతికి ప్రతీక) అని నామకరణం చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్,



కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు టీజీ భరత్, నారాయణ,

2లో..

# రాహుల్ గాంధీకి రూ.1000 కోట్లు, రైతులకు వెన్నుపోట్లా?

## - అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తామన్న కేటీఆర్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) 'తెలంగాణను ఒక ఏటీఎం గా మార్చి ఏఐసీసీకి సమర్పించుకునే దానిమీద ఉన్న శ్రద్ధ ఈ రాష్ట్రంలోని పేదల మీద లేదు అనేది తప్పకుండా రాష్ట్రంలోని ప్రతి పేదవాడి తరపున ఈ ప్రభుత్వాన్ని నిగ్గదీస్తాం, నిలదీస్తాం'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. '100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని అందులో ముఖ్యంగా రాహుల్

2లో..

# హైదరాబాద్‌లో భారీ వర్షం

## - ఒక్కసారిగా మారిపోయిన వాతావరణం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ సహా తెలంగాణలోని పలు ప్రాంతాల్లో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. సోమవారం సాయంత్రం భాగ్యనగరంలో భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం

2లో..

# రాయ్‌పూర్ - విశాఖపట్నం భూ కుంభకోణం

## - రూ.23 కోట్లు అటాచ్ చేసిన ఈడీ

అమరావతి (ప్రశ్న న్యూస్) భారత్‌మాల పరియోజన కింద చేపట్టిన రాయ్‌పూర్–విశాఖపట్నం జాతీయ రహదారి నిర్మాణంలో జరిగిన భారీ భూసేకరణ కుంభకోణంలో

2లో..



# భారత్‌కు భారీ ఊరట

## - ముంద్రా పోర్టుకు చేరుకున్న ఎల్పీజీ ట్యాంకర్ 'శివాలిక్'

2లో..



# అసెంబ్లీలో కొలువుదీరిన తెలంగాణ తల్లి

## - విగ్రహాన్ని ఆవిష్కరించిన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ శాసనసభ ఆవరణలో ఒక చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. రాష్ట్ర గౌరవానికి, సంస్కృతికి ప్రతీకగా నూతనంగా ఏర్పాటు చేసిన 'తెలంగాణ తల్లి' విగ్రహాన్ని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిలతో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. తెలంగాణ

2లో..

# చిట్‌చాట్‌లు మానివేయండి

## - సీఎల్పీ సమావేశంలో ఎమ్మెల్యేలకు సీఎం క్లాస్

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీఎల్పీ సమావేశంలో ఎమ్మెల్యేలకు క్లాస్ తీసుకున్నారు. పలువురి తీరుపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. సీఎల్పీ సమావేశం సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అసెంబ్లీలో, బయట అనవసర విషయాలు మాట్లాడవద్దని సూచించారు. సభకు అన్ని విధాలుగా ప్రిపేర్ అయి రావాలని అన్నారు. బయట చిట్‌చాట్‌లు మానివేయాలని అన్నారు. ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాలలోని సమస్యలను చెప్పుకోవడానికి మంత్రులు వారికి సమయం ఇవ్వాలని సూచించారు. ఎమ్మెల్యేలు చెప్పే సమస్యలకు స్పందించాలని అన్నారు. ఇక నుంచి తాను కూడా ఎమ్మెల్యేలకు సమయం ఇస్తానని

2లో..



## రాయ్‌పూర్ - విశాఖపట్నం భూ కుంభకోణం

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కీలక చర్యలు తీసుకుంది. ఈ స్కామ్‌తో సంబంధం ఉన్న రూ.23.35 కోట్ల విలువైన చర, స్థిరాస్తులను అటాచ్ చేసినట్లు సోమవారం ప్రకటించింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) నిబంధనల కింద ఈ చర్యలు తీసుకున్నట్లు ఈడీ అధికారులు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ ఆర్థిక నేరాల విభాగం/ఏసీబీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ దర్యాప్తు ప్రారంభించింది. దర్యాప్తులో భూమి బ్రోకర్లు, ప్రైవేట్ వ్యక్తులు, కొందరు ప్రభుత్వ అధికారులు కుమ్మక్కై నేరపూరిత కుట్రకు పాల్పడినట్లు తేలింది. రహదారి నిర్మాణం కోసం భూసేకరణ నోటిఫికేషన్ జారీ అయిన తర్వాత, రెవెన్యూ రికార్డులను పాత తేదీలతో తారుమారు చేసి భూమిని చిన్న చిన్న భాగాలుగా విభజించినట్లు చూపించారు. తద్వారా భూమికి చెల్లించాల్సిన పరిహారాన్ని కృత్రిమంగా పెంచారు. ఈ కుట్రలో ప్రధాన నిందితుడైన హర్మీత్ సింగ్ ఖనుజా, అతని అనుచరులు రైతులతో మాట్లాడి, వారి నుంచి అఫిడవిట్లు, ఖాళీ చెక్కులు, ఇతర పత్రాలపై సంతకాలు తీసుకున్నారు. అనంతరం రైతుల పేర్లతో కొత్త బ్యాంకు ఖాతాలు తెరిపించి, పెంచిన పరిహారం మొత్తాన్ని ఆ ఖాతాల్లో జమ చేశారు. తర్వాత, ముందే తీసుకున్న ఖాళీ చెక్కులను ఉపయోగించి, అదనపు పరిహారం మొత్తాన్ని తమ వ్యక్తిగత, అనుబంధ ఖాతాల్లోకి మళ్లించుకున్నారు. రైతులకు మాత్రం వాస్తవంగా రావలసిన పరిహారం లేదా కొద్దిగా ఎక్కువ మొత్తం ఇచ్చి మోసం చేశారు. ఈ పద్ధతిలో నిందితులు మొత్తం రూ.27.05 కోట్లు పక్కదారి పట్టించినట్లు దర్యాప్తులో తేలింది. ఇందులో రూ.23.35 కోట్ల మేర నిధులను గుర్తించి, వాటితో కూడబెట్టిన ఆస్తులను తాత్కాలికంగా జప్తు చేసినట్లు ఈడీ తన ప్రకటనలో వివరించింది. ఈ కేసులో తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది.

## భారత్‌కు భారీ ఊరట

గాంధీ నగర్ (ప్రశ్న న్యూస్) పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, భారత్‌కు ఇంధన సరఫరా విషయంలో భారీ ఊరట లభించింది. ఖతార్ నుంచి ద్రవీకృత పెట్రోలియం గ్యాస్ (ఎల్పీజీ)తో బయలుదేరిన 'శివాలిక్' అనే భారత నౌక, అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిని దాటి సోమవారం సాయంత్రం 5 గంటలకు గుజరాత్‌లోని ముంద్రా పోర్టుకు సురక్షితంగా చేరుకుంది. ఈ నౌకలో సుమారు 45,000 మెట్రిక్ టన్నుల ఎల్పీజీ ఉంది. ప్రభుత్వ రంగ సంస్థ అయిన షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు చెందిన 'శివాలిక్', 'నందా దేవి' అనే రెండు నౌకలు కలిపి మొత్తం 92,700 మెట్రిక్ టన్నుల ఎల్పీజీని భారత్‌కు తీసుకువస్తున్నాయి. శివాలిక్ ఇప్పటికే తీరానికి చేరుకోగా, 'నందా దేవి' అనే మరో ట్యాంకర్ రేపు ఉదయం గుజరాత్‌లోని కాండ్లా పోర్టుకు రానుంది. ఈ విషయాన్ని కేంద్ర నౌకాశ్రయాలు, షిప్పింగ్ మంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేష్ కుమార్ సిన్హా ధృవీకరించారు.పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో పనిచేస్తున్న భారత నావికులందరూ సురక్షితంగా ఉన్నారని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదని సిన్హా స్పష్టం చేశారు. ప్రస్తుతం హోర్ముజ్ జలసంధికి పశ్చిమాన 22 భారత నౌకలు ఉన్నాయని, వాటిలో 611 మంది సిబ్బంది ఉన్నారని తెలిపారు. వీటితో పాటు, యూఏఈ నుంచి సుమారు 81,000 టన్నుల ముడిచమురుతో వస్తున్న 'జగ్ లాడ్కీ' నౌక కూడా ముంద్రా పోర్టుకు వస్తోందని, ఆ నౌకలోని సిబ్బంది కూడా క్షేమంగా ఉన్నారని అధికారులు వెల్లడించారు. ప్రపంచంలోని చమురు, గ్యాస్ ఎగుమతుల్లో దాదాపు 20 శాతం హోర్ముజ్ జలసంధి గుండానే జరుగుతాయి. ఈ ప్రాంతంలో ఉద్రిక్తతల నేపథ్యంలో, అధికారులు నౌకల కదలికలను నిశితంగా గమనిస్తూ, షిప్పింగ్ లైన్లకు అవసరమైన మద్దతును అందిస్తున్నారు.

## అసెంబ్లీలో కొలువుదీరిన తెలంగాణ తల్లి

అస్తిత్వాన్ని ప్రతిబింబించేలా ఈ విగ్రహాన్ని అసెంబ్లీ ప్రాంగణంలో ప్రతిష్టించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈ ఆవిష్కరణ కార్యక్రమానికి ముందు గవర్నర్, ముఖ్యమంత్రి, ఇతర నేతలు అసెంబ్లీ ఆవరణలోని మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాల వద్ద ఘనంగా నివాళులర్పించారు. దేశానికి వారు అందించిన గొప్ప సేవలను స్మరించుకున్నారు. విగ్రహావిష్కరణ అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, ఈ తెలంగాణ తల్లి విగ్రహం కేవలం ఒక రూపం మాత్రమే కాదని, ఇది కోట్లాది మంది తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి, పోరాట స్ఫూర్తికి నిదర్శనమని పేర్కొన్నారు.

## చిట్‌చాట్‌లు మానివేయండి

ముఖ్యమంత్రి అన్నారు. సభలో ప్రతిపక్షాల ప్రతి అంశానికి కౌంటర్ ఇవ్వాలని సూచించారు. ఇప్పటి సీఎల్పీ సమావేశానికి ఆరుగురు సభ్యులు రాలేదని ముఖ్యమంత్రి సీరియస్ అయ్యారు. సీఎల్పీకి రాలేనంత బిజీగా ఉన్నారా అని అసహనం వ్యక్తం చేశారు. ఆరోగ్య సమస్యలు ఉంటే మాత్రం మినహాయించవచ్చని పేర్కొన్నారు. అసెంబ్లీకి ప్రతి ఒక్కరు హాజరు కావాల్సిందే అని స్పష్టం చేశారు. తాము ప్రవేశపెట్టనున్న ఈ బడ్జెట్ ఇన్నోవేటివ్‌గా ఉంటుందని, విద్య, వైద్యంకు ప్రాధాన్యత ఉంటుందని వెల్లడించారు. సభలో మాట్లాడే సమయంలో విప్‌ల మధ్య సమన్వయం ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు. బీఆర్ఎస్ హయాంలో జానారెడ్డి, మల్లు భట్టివిక్రమార్కలకు కూడా మైక్ ఇవ్వని సందర్భాలు ఉన్నాయని, కానీ తాము ప్రతిపక్షాలకు మాట్లాడే సమయం ఇస్తున్నామని అన్నారు. రాజకీయాల్లో మాట్లాడే మాటల వల్ల వ్యక్తిగత డ్యామేజీ ఏమో కానీ, వ్యవస్థపై ప్రభావం పడుతుందని హెచ్చరించారు. ప్రతి ఒక్కరు పార్టీ, ప్రభుత్వం లైన్‌లోనే స్పందించాలని సూచించారు.

## హైదరాబాద్‌లో భారీ వర్షం

కురవడంతో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. కార్యాలయాల నుంచి ఇంటికి వెళ్లే సమయంలో వర్షం పడటంతో ఉద్యోగులు, వాహనదారులు ఇబ్బందిపడ్డారు. మాదాపూర్, గచ్చిబౌలి, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఖైరతాబాద్, అమీర్‌పేట్, కూకట్‌పల్లి, సికింద్రాబాద్ ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. నగరంలో పలుచోట్ల రోడ్లపై నీరు మోకాళ్ల లోతుకు వచ్చింది. నగరంలో పలుచోట్ల భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. నగరంలో నెలకున్న ఈ క్లిష్ట పరిస్థితులపై గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తక్షణమే స్పందించారు. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన నీటిని తొలగించేందుకు పంపు సెట్లను ఏర్పాటు చేశారు. మ్యాన్‌హోల్స్ వద్ద సిబ్బందిని కాపలా ఉంచి, ఎటువంటి ప్రమాదాలు జరగకుండా నీటి ప్రవాహానికి ఉన్న అడ్డంకులను తొలగించారు.

### రానున్న నాలుగు రోజుల్లో వర్షాలు

హైదరాబాద్‌తోపాటు తెలంగాణ వ్యాప్తంగా మరో నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఆయా జిల్లాల యంత్రాంగాలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం ఆదేశించింది. మార్చి 16న వెలువడిన తాజా బులెటిన్ ప్రకారం, బంగాళాఖాతంలో ఏర్పడిన వాతావరణ మార్పుల కారణంగా ఈ అకాల వర్షాలు కురుస్తున్నాయి.

## శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**తిరుపతి,** తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో మార్చి 19వ తేదీ ఉగాది ఆస్థానం పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా జరిగింది. ఇందులో భాగంగా తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి తోమాలసేవ, సహస్రనామార్చన నిర్వహించారు. తరువాత ఉదయం 7 నుండి 9 గంటల వరకు శ్రీ గోవిందరాజస్వామివారి సన్నిధి, శ్రీ పార్థసారథి స్వామివారి సన్నిధి, శ్రీ ఆండాల్ అమ్మవారు, శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి, శ్రీ పుండరికవల్లీ ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేసిన అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం ఉదయం 9.30 గంటల నుండి భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు.

## ఎంపి పుట్టా వ్యవహారం పై సీఎం చంద్రబాబు ఆగ్రహం

**విజయవాడ** టీడీపీ పుట్టా మహేశ్ డ్రగ్స్ వ్యవహారంపై సీఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు.. పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని ఆదేశించారు.. ఘటనపై వివరణ కోరుతూ మహేష్ కు నోటీసులు ఇవ్వాలని,పూర్తి నివేదిక తనకు సమర్పించాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ కు సూచించారు. డ్రగ్స్ కేసుల్లో ఎవరున్నా ఉపేక్షించేది లేదని చంద్రబాబు స్పష్టం చేశారు. నేతల బలహీనతలు,తప్పులకు పార్టీ నష్టపోయే పరిస్థితి రానివ్వనని తేల్చిచెప్పారు..

## నగరంలో 2. 44 కేజీల గంజాయి స్వాధీనం

మలక్‌పేట్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని సంతోష్‌నగర్‌లో ఎస్‌టీఎఫ్ అధికారులు దాడులు నిర్వహించి, 359 గంజాయి పాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం బరువు 2.44 కేజీలుగా గుర్తించారు. ఒక్కో పాకెట్‌లో 6?7 గ్రాముల గంజాయి ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనలో సయ్యద్ మన్నన్ (31)ను అరెస్ట్ చేయగా, అక్రూర్ ఖాన్‌పై కూడా కేసు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న గంజాయిని ఆదివారం మలక్‌పేట్ ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించారు.

## రాహుల్ గాంధీకి రూ.1000 కోట్లు, రైతులకు వెన్నుపోట్లా?

గాంధీ తాము రాష్ట్ర ప్రభుత్వంలోకి వచ్చిన మరుక్షణమే మొదటి క్యాబినెట్‌లోనే ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పి ఇప్పటికీ రెండున్నర సంవత్సరాలు గడిచినా ఇంతవరకు చట్టబద్ధత కల్పించలేనన్న మాట వాస్తవం'అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. తెలంగాణ అసెంబ్లీ, శాసన మండలి సమావేశాలప్రారంభోత్సవం సందర్భంగా గన్ పార్క్ వద్ద నివాళులు అర్పించారు. ఎవరి త్యాగాల వల్లనైతే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందో వారి స్ఫూర్తిని గుర్తు చేసుకుంటూ, వారి త్యాగాలకు మరొక్కసారి ప్రణమిల్లుతూ నివాళులర్పించారు. తెలంగాణ అమరవీరులకు, విద్యార్థి అమరవీరులకు నివాళులర్పించి శాసనసభ సమావేశాలకు హాజరు కాబోతున్నాం అని కేటీఆర్ అన్నారు.

### రాహుల్ బంధు కాదు రైతు బంధు వేయండి

ఆరు గ్యారంటీలపై తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోంది అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. మొట్టమొదటి గవర్నర్ ప్రసంగంలోనే ఆనాడే రాష్ట్ర ప్రభుత్వం చెప్పింది. ముఖ్యమంత్రి సంతకం పెట్టారు.ఇంకా అప్పుడు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ నోటమ్మట చెప్పించారు అని కేటీఆర్ గుర్తు చేశారు. 'రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చట్టబద్ధత కల్పిస్తదని చెప్పి వారు ఆనాడు చెప్పినప్పటికీ ఇప్పటికీ రెండున్నర సంవత్సరాలు అయ్యింది. ఇది మూడో గవర్నర్ ప్రసంగం. ఇంతవరకు ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత లేదు.పంటలు నాట్లు వేసేటప్పుడు నిజానికి కేసీఆర్ గారి టైంలో రైతుబంధు పడేది. కానీ ఇవాళ పంటలు కోతలకు వచ్చినా రైతుబంధు దిక్కులేదు. ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒక స్పష్టత, ఒక సమాధానం లేదు. అందుకే 'రాహుల్ బంధు కాదు, రైతుబంధు వేయండి', 'రాహుల్ కు 1000 కోట్లు, రైతులకు వెన్నుపోట్లా' అని చెప్పి ఈ సభా సమావేశాల్లోనే బడ్జెట్ సమావేశంలో తప్పకుండా నిలదీస్తాం'అని కేటీఆర్ హెచ్చరించారు.

### 2లక్షల ఉద్యోగాల ఊసే లేదు

'అన్ని వర్గాలకు హామీలిచ్చి మోసం చేసిన ప్రభుత్వం ఇది. బలహీన వర్గాలకు లక్ష కోట్ల బడ్జెట్ అన్నారు. ఐదేళ్లలో మరి రెండు బడ్జెట్లు అయిపోయినవి, ఇది మూడో బడ్జెట్. ఈపాటికే 60 వేల కోట్లు పెట్టి ఉండాలి. మరి ఇంతవరకు దానిమీద కూడా స్పష్టత లేదు'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. 'అట్లాగే ఎస్సీ ఎస్టీలకు అంబేద్కర్ అభయహస్తం ప్రవేశపెడతామన్నారు. మరి రూ.12 లక్షలు ఇస్తామన్నారు. దళితబంధు స్థానంలో, ఇంతవరకు అదీ అతీగతీ లేదు. రెండు లక్షల ఉద్యోగాల ఊసే లేదు. ఇతర వర్గాలకు 10 వేల ఉద్యోగాలు ఇచ్చిన పరిస్థితి లేదు. అట్లాగే ఆరు గ్యారెంటీలకు అయితే మంగళం పాడినట్టే కనబడుతున్నది'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు.

### జాబ్ క్యాలెండర్ ఇంకెప్పుడు.?

'మహిళలు ఎదురుచూస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా రెండున్నర వేలు 100 రోజుల్లో ఇస్తామన్నారు ఎప్పటి నుంచి ఇస్తారని. ముసలివాళ్లు ఎదురుచూస్తున్నారు పెద్దమనుషులు రూ.4 వేల పెన్షన్లు ఎప్పటినుంచి వస్తాయని. రైతులు రైతుభరోసా కోసం, రైతుబంధు కోసం ఎదురుచూస్తా ఉన్నారు. రైతు కూలీలు నెలకి ఇస్తానన్న వెయ్యి రూపాయల కోసం ఎదురుచూస్తా ఉన్నారు'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు.'ఆటో అన్నలు ఎదురుచూస్తా ఉన్నారు వెయ్యి రూపాయల కోసం.ముఖ్యంగా తెలంగాణ విద్యార్థులు 10 వేల కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు ఏదైతే గవర్నమెంట్ చెల్లించాలో వాటి విషయంలో కూడా మొత్తం విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఎదురుచూస్తున్నారు. ఈ అన్ని విషయాల్లో ఉద్యోగ జాబ్ క్యాలెండర్ అన్నారు, ఇంతవరకు ఆ క్యాలెండర్ లో మరి కొత్త క్యాలెండర్ ఉందే తప్ప జాబ్స్ అయితే కనబడట్లేదు'బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు.

### పేదవాడి తరపున ప్రభుత్వాన్ని నిలదీస్తాం

'ఈ అన్ని విషయాల్లో తప్పకుండా ప్రభుత్వాన్ని శాసనసభ సమావేశాల్లో నిలదీస్తాం, నిగ్గదీస్తాం. ఎక్కడ పోతున్నాయి డబ్బులు అని అడుగుతాం.మరి కేసీఆర్ కట్టిన ఇల్లు పెట్టిన పొయ్యి అన్నట్టు మీకు బ్రహ్మాండమైన వడ్డించిన విస్తరి లాంటి రాష్ట్రాన్ని మీకు అప్పజెపితే, మీరు ఏం చేస్తున్నారు? ఆర్థిక అరాచకం చేస్తా ఉన్నారు.'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు.'రిటైర్డ్ ఎంప్లాయిస్ కు కనీసం బెనిఫిట్స్ ఇవ్వలేని దుస్థితిలో ఈ రాష్ట్ర ప్రభుత్వం ఇవాళ రాష్ట్రం ఉన్నదంటే దానికి కారణం కచ్చితంగా ఫైనాన్షియల్ మిస్ మేనేజ్మెంట్. తెలంగాణను ఒక ఏటీఎం గా మార్చి ఏఐసీసీకి సమర్పించుకునే దానిమీద ఉన్న శ్రద్ధ ఈ రాష్ట్రంలోని పేదల మీద లేదు అనేది తప్పకుండా రాష్ట్రంలోని ప్రతి పేదవాడి తరపున ఈ ప్రభుత్వాన్ని నిగ్గదీస్తాం, నిలదీస్తాం'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు.

## పకడ్బందీగా ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు

**మైలవరం** ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గవ్యాప్తంగా పదో తరగతి వార్షిక పరీక్షలు పకడ్బందీగా ప్రారంభమయ్యాయి.

సోమవారం ఉదయం 9:30 గంటలకు పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతించగా, అనంతరం అధికారికంగా పరీక్షలు ప్రారంభమయ్యాయి.ఈ నెల 16వ తేదీ నుండి 30వ తేదీ వరకు పదో తరగతి వార్షిక పరీక్షలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులు తమ హాల్ టికెట్ నంబర్లు, రూమ్ అలాట్‌మెంట్లను సరిచూసుకున్నారు.తల్లిదండ్రులు తమ పిల్లలను పరీక్షా కేంద్రాల వద్ద దించి, రూమ్ నంబర్లు చూసుకోవడంలో సహాయపడుతూ కనిపించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మైలవరం నియోజకవర్గవ్యాప్తంగా అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.

## రాజధానిలో హెచ్చోడి టవర్ల నిర్మాణంలో కీలక ఘట్టం

**అమరావతి**మంత్రి నారాయణ మాట్లాడుతూ అమరావతిలో జీఏడీ,హెచ్ ఓడీ లకు మొత్తం 5 టవర్లు డయాగ్రిడ్ టెక్నాలజీతో నిర్మిస్తున్నాం. జీఏడీ టవర్ మొత్తం 47 అంతస్తులతో మిగిలిన టవర్లు 40 అంతస్తులతో నిర్మిస్తున్నాం.

మొత్తం 53 లక్షల చదరపు అడుగుల బిల్టప్ ఏరియాతో 5 టవర్లు నిర్మాణం చేస్తున్నామని అన్నారు.అధికార యంత్రాంగం మొత్తం ఒకేచోట ఉండేలా టవర్ల నిర్మాణం ప్లాన్ చేసాం. ప్రజలకు ఏ అవసరం ఉన్నా ఒకేచోట అన్ని కార్యాలయాలు ఉండేలా డిజైన్ చేశాం. 2028 అక్టోబర్ నాటికి అన్ని టవర్ల నిర్మాణం పూర్తి చేస్తాం. ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీల క్వార్టర్ల నిర్మాణం దాదాపు పూర్తి కావచ్చింది. ట్రంక్ రోడ్లు,లేఅవుట్ రోడ్లతో పాటు ప్రయివేట్ సంస్థల నిర్మాణాలు ప్రారంభం అయ్యాయి. రైతులకు మాట ఇచ్చిన విధంగా అమరావతి రాజధాని నిర్మిస్తామని అన్నారు.

## పాల్వంచలో ఇఫ్తార్ విందుకు ఎంపి వద్దిరాజు హాజరు

**పాల్వంచ** పవిత్ర రంజాన్ మాసం ఉపవాస దీక్షల సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో ఆదివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ముఖ్య అతిథిగా హాజరయ్యారు.పాల్వంచ నటరాజ్ చౌరస్తా వద్ద ఉన్న జామామసీద్ లో ఏర్పాటు చేసిన ఈ విందుకు విచ్చేసిన ఎంపీ రవిచంద్ర,వనమా రాఘవలను స్థానిక ముస్లిం మత పెద్దలు పూలమాలలు శాలువాలతో సత్కరించారు.బీఆర్ఎస్ నాయకుడు మల్లెల రవిచంద్ర,ఆయన సతీమణి,37వ డివిజన్ కార్పోరేటర్ స్వప్నకుమారిల ఆధ్వర్యాన ఏర్పాటైన ఈ విందుకు సుమారు 1,000 మంది హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు ముస్లిం సోదరులకు పవిత్ర రంజాన్ మాసం శుభాకాంక్షలు తెలిపారు.

## పదోతరగతి పరీక్షలు ప్రారంభం

**చిత్తూరు జిల్లా** పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్న పోలీసులుచిత్తూరు జిల్లాలో ఇవాళ నుండి వచ్చే నెల ఏప్రిల్ 1 తేదీ వరకు పదో తరగతి (ఌూఅ) పబ్లిక్ పరీక్షలు ప్రారంభం అయ్యాయి. ఈ పరీక్షలు ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 12:45 వరకు జరుగుతున్నాయి. పరీక్షలు పకడ్బందీగా, పారదర్శకంగా, ఎటువంటి కాపీయింగ్ కి అస్కారం లేకుండా నిర్వహించేందుకు విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.

చిత్తూరు జిల్లాలో మొత్తం 129 మంది చీఫ్ సూపరింటెండెంట్స్, డిపార్ట్మెంట్ ఆఫీసర్స్, 1,100 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. 12 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి, 6 ఫ్లైయింగ్ స్క్వాడ్స్‌తో నిఘా పెట్టారు.

## హైడ్రా ద్వారా 60 వేల కోట్ల ఆస్తులు కాపాడాం

స్వయం సహాయక బృందాలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దనుంది. మహిళల ఆదాయ మార్గాలను మెరుగుపరచడానికి ప్రభుత్వం వినూత్న బాధ్యతలను అప్పగిస్తోంది. సోలార్ ప్యానెళ్ల నిర్వహణ, పారిశ్రామిక క్లస్టర్ల ఏర్పాటు, ఆర్టీసీ బస్సుల నిర్వహణ, స్కూల్ యూనిఫాంల తయారీ వంటి రంగాల్లో మహిళా సంఘాలకు భాగస్వామ్యం కల్పిస్తోంది. అలాగే సచివాలయం, కలెక్టరేట్లలో 'మహిళా శక్తి క్యాంటీన్లను' ఏర్పాటు చేసి వారిని వ్యాపార యజమానులుగా మారుస్తోంది. భద్రత, ఆర్థిక భరోసా కోసం 63.31 లక్షల మంది సభ్యులకు రూ. 5 లక్షల జీవిత బీమా సౌకర్యం కల్పించింది. వడ్డీ లేని రుణాలను (విఎల్ఆర్) అందిస్తూ వారి ఆర్థిక భారాన్ని తగ్గిస్తోంది. వి-హబ్ ద్వారా 33 జిల్లాల్లో సాంకేతిక శిక్షణను అందిస్తూ, తెలంగాణ మహిళలు దేశానికే ఆదర్శంగా, ఆర్థిక శక్తులుగా ఎదిగేలా ప్రభుత్వం తోడ్పాటునందిస్తోందని' గవర్నర్ తన ప్రసంగంలో పేర్కొన్నారు.

### - పట్టణాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ

హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దే క్రమంలో జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా విభజించినట్లు గవర్నర్ శివప్రతాప్ శుక్లా తెలిపారు. నగరంలోని చెరువుల పునరుజ్జీవనం కోసం నూతనంగా ఏర్పడిన హైడ్రా ఇప్పటికే 1,045 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుందని వెల్లడించారు. అలాగే, 55 కి.మీ మేర చేపట్టనున్న మూసీ రివర్ ఫ్రంట్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్టు ద్వారా పర్యావరణ కారిడార్‌ను అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించారు. ఫ్యూచర్ సిటీ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా ఎఫ్‌సీడీఏ ఏర్పాటు చేయడం ఒక కీలక మైలురాయిగా తన ప్రసంగంలో గవర్నర్ పేర్కొన్నారు.

### - వ్యవసాయం, రైతు సంక్షేమం

వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తోందని, 2025-26 బడ్జెట్‌లో ఈ రంగానికి రూ.26,684 కోట్లు కేటాయించినట్లు గవర్నర్ శివప్రతాప్ శుక్లా వివరించారు. రైతులకు పెట్టుబడి మద్దతు కింద 'రైతు భరోసా' ద్వారా నిధులు విడుదల చేయడంతో పాటు, రూ. 2 లక్షల వరకు పంట రుణ మాఫీని విజయవంతంగా అమలు చేస్తున్నారని తెలిపారు. సన్నరకం వరి పండించే రైతులకు క్వింటాల్‌కు రూ. 500 బోనస్ అందిస్తూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

### - పరిశ్రమలు ఏర్పాటు, ఉపాధి కల్పన

తెలంగాణను పెట్టుబడులకు గమ్యస్థానంగా మార్చేందుకు నిర్వహించిన 'తెలంగాణ రైజింగ్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్' ద్వారా రూ. 5.75 లక్షల కోట్ల పెట్టుబడి ఒప్పందాలు కుదిరాయని గవర్నర్ తెలిపారు. ఐటీ ఎగుమతులు రూ. 3.13 లక్షల కోట్లకు చేరాయని, 9.39 లక్షల మందికి ఉపాధి లభిస్తోందని వెల్లడించారు. అంతేకాకుండా, అంతర్జాతీయ ఉపాధి కోసం టామ్ కామ్ ద్వారా విదేశాల్లో వేలాది మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే కాకుండా, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తున్నట్లు ఉభయ సభలకు ప్రభుత్వ లక్ష్యాలు, విధానాలను గవర్నర్ శివప్రతాప్ శుక్లా వివరించారు.

## మమత వర్సస్ సువేందు

విషయం తెలిసిందే. అయితే ఆ మరుసటి రోజే బీజేపీ తన తొలి జాబితాను వెల్లడించింది. ఈ మేరకు 144 మందితో కూడిన జాబితాను తాజాగా విడుదల చేసింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశంలో ఈ అభ్యర్థుల పేర్లను ఖరారు చేశారు. ఈ సమావేశంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తదితర అగ్రనేతలు పాల్గొన్నారు. గెలుపే లక్ష్యంగా క్షేత్రస్థాయి నివేదికల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది.ఇక బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ప్రాతినిథ్యం వహిస్తున్న భవానీపూర్ నియోజకవర్గం నుంచి రాష్ట్ర ప్రతిపక్షనేత సువేంధు అధికారి పోటీ చేయనున్నారు. మరోవైపు నందిగ్రామ్ నుంచి కూడా ఆయనే బరిలో నిలవనున్నారు. అయితే 2011 నుంచి భవానీపూర్ నియోజకవర్గం తృణమూల్ కాంగ్రెస్ కంచుకోటగా ఉంది. సువేందు అధికారి పోటీ చేయనున్న నేపథ్యంలో మరి ఈ సారి కూడా టీఎంసీ ఈ స్థానాన్ని నిలబెట్టుకుంటుందా.? లేదా.? అన్నది తేలాల్సి ఉంది. ఇక పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో మొత్తం 294 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. బెంగాల్ లోని ప్రస్తుత శాసనసభ పదవీకాలం మే 7 వ తేదీతో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఈ తేదీలోపే అక్కడ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. ఇక ఈ సారి కూడా టీఎంసీ, బీజేపీ పార్టీల మధ్యే హోరాహోరీ జరిగే అవకాశం ఉంది. అలాగే కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు ఏ మేరకు సీట్లు సాధిస్తాయో చూడాలి. బెంగాల్ లో పోలింగ్ ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు దశల్లో ఉంటుంది. ఇక కౌంటింగ్ మే 4 న జరగనుంది.

## జగిత్యాలలో రాజకీయ ప్రకంపనలు!

లేకుండా పోవడం ఆయనను తీవ్రంగా బాధించింది.

### - గౌరవం లేని చోట కొనసాగలేను: జీవన్ రెడ్డి అంతరంగం

తనకు, తనను నమ్ముకున్న అనుచరులకు పార్టీలో కనీస గౌరవం, ప్రాధాన్యత దక్కడం లేదని జీవన్ రెడ్డి భావిస్తున్నారు. సీనియర్ నేతా తన సలహాలను పక్కనపెట్టి, కొత్తగా వచ్చిన వారికి ప్రాముఖ్యత ఇవ్వడం ఆయనకు మింగుడుపడటం లేదు. ఈ క్రమంలోనే ఆయన తన సన్నిహితులు, ముఖ్య అనుచరులతో సుదీర్ఘంగా చర్చలు జరిపారు. పార్టీలో మనకు గుర్తింపు లేనప్పుడు ఇక్కడ కొనసాగడం కంటే ప్రత్యామ్నాయం చూసుకోవడమే ఉత్తమం అనే అభిప్రాయానికి ఆయన వచ్చినట్టు సమాచారం. ఆయన సోషల్ మీడియా ఖాతాల నుంచి కాంగ్రెస్ పేరును తొలగించడం, తన అనుచరుల సోషల్ మీడియా పోస్టులు పార్టీ మార్పును ధృవీకరిస్తున్నట్టు కనిపిస్తున్నాయి. అయినప్పటికీ బహిరంగంగా మాత్రం ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు అని ఆయన కొంత సమయం తీసుకుంటున్నట్టు తెలుస్తోంది.

### - జగిత్యాల సభలో కారు ఎక్కనున్న జీవన్ రెడ్డి!

రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం, ఈ నెల 25న జగిత్యాలలో ఒక భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయాలని జీవన్ రెడ్డి నిర్ణయించుకున్నారు. ఈ వేదికపైనే ఆయన తన భవిష్యత్ కార్యాచరణ ప్రకటించి, వేలాది మంది అనుచరులతో కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే బీఆర్ఎస్ అగ్రనేతలు కేసీఆర్, కేటీఆర్‌తో టచ్‌లో ఉన్నారని సమాచారం. పార్టీలో ఆయనకు సముచిత స్థానం, తగిన గౌరవం ఇస్తామని బీఆర్ఎస్ అధిష్ఠానం నుంచి గట్టిగా హామీ లభించినట్టు తెలుస్తోంది.

### - బీఆర్ఎస్‌కు కొత్తజోష్- కాంగ్రెస్‌కు షాక్

జీవన్ రెడ్డి వంటి సీనియర్ నేత పార్టీని వీడటం కాంగ్రెస్‌కు పెద్ద షాక్ అని చెప్పవచ్చు. ముఖ్యంగా జగిత్యాల నియోజకవర్గంలో ఆయనకు పటిష్టమైన క్యాడర్ ఉంది. ఆయన నిర్ణయం వల్ల కాంగ్రెస్ బలం తగ్గే అవకాశం ఉండగా, బీఆర్ఎస్‌కు ఇది ఉత్తర తెలంగాణలో పెద్ద బూస్ట్‌గా మారనుంది. జగిత్యాలలో బీఆర్ఎస్ బలం మళ్లీ పుంజుకోవడానికి జీవన్ రెడ్డి రాక ఒక వరంలా మారుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## ముస్లింల అభివృద్ధి, సంక్షేమమే మా లక్ష్యం

పనిచేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాల్లో ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 21 నెలల కాలంలో మైనారిటీల సంక్షేమానికి అనేక పథకాలు అందించామని చంద్రబాబు వివరించారు. ఎన్టీఆర్ భరోసా కింద 4.38 లక్షల మంది ముస్లింలకు ఏటా రూ.3,511 కోట్లు అందిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా, 4.5 లక్షల మంది విద్యార్థులకు 'తల్లికి వందనం' అందిస్తున్నామని, 19,215 మందికి పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్పుల కింద రూ.240 కోట్లు, దీపం పథకం ద్వారా 6.20 లక్షల కుటుంబాలకు రూ.158 కోట్లు ఖర్చు చేస్తున్నామని పేర్కొన్నారు. 33,275 మందికి ఆర్థిక చేయూత కింద రూ.193 కోట్లు అందించామని చెప్పారు. ఇమామ్‌లు, మౌజన్‌లకు గౌరవ వేతనాన్ని రూ.5 వేలు, రూ.10 వేలకు పెంచి రూ.180 కోట్లు అందించామని, బకాయిలుగా ఉన్న రూ.45 కోట్లను కూడా విడుదల చేస్తున్నామని ముఖ్యమంత్రి ప్రకటించారు. అర్హులైన ఇమామ్‌లను ప్రభుత్వ ఖాజీలుగా నియమించనున్నామని, వివాహ లైసెన్స్ గడువును 3 ఏళ్ల నుంచి 10 ఏళ్లకు పెంచుతున్నామని హామీ ఇచ్చారు. ఈ ఏడాది విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచే 347 మంది హజ్ యాత్రకు వెళ్లేలా ఏర్పాట్లు పూర్తిచేశామని గుర్తుచేశారు. గత పాలకులు జీవో 47 ద్వారా వక్ఫ్ బోర్డును వివాదాల్లోకి నెట్టారని చంద్రబాబు విమర్శించారు. తమ ప్రభుత్వం ఆ జీవోను రద్దు చేసి, బోర్డుకు ఎన్నికలు నిర్వహించిందని, సుమారు 1500 వక్ఫ్ ఆస్తులపై సర్వే పూర్తి చేశామని తెలిపారు. వక్ఫ్ ఆస్తులను కాపాడి, వాటి ఫలాలను ముస్లింల సంక్షేమానికే వినియోగిస్తామని భరోసా ఇచ్చారు. నూర్ బాషా ఫెడరేషన్‌ను దూదేకుల ముస్లిం ఫైనాన్స్ కార్పొరేషన్‌గా మార్చి రూ.100 కోట్లు కేటాయించామన్నారు. మైనారిటీల సంక్షేమానికి తమ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను వివరిస్తూ, గత బడ్జెట్‌లో కేటాయించిన రూ.5,434 కోట్ల నుంచి ఈసారి రూ.6,090 కోట్లకు పెంచామని వెల్లడించారు. గత ప్రభుత్వం ఉర్దూ అకాడమీకి కేవలం రూ.1 లక్ష ఇస్తే, తాము రూ.7 కోట్లు మంజూరు చేశామన్నారు. ఉర్దూను రెండో అధికార భాషగా గుర్తించామని, కడప, విజయవాడ నగరాల్లో హజ్ హౌస్‌ల నిర్మాణం త్వరలో పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొస్తామని ఆయన తన ప్రసంగాన్ని ముగించారు.

## పోలీసులమని చెప్పినా కాల్పులు జరిపారు

**హైదరాబాద్** ఫాంహౌస్ డ్రగ్స్ పార్టీపై నమోదయిన ఎఫ్ఐఆర్ కీలక అంశాలు బయటపడ్డాయి. డ్రగ్స్తో పాటు మందు పార్టీ జరిగింది. మద్యం, కొకైన్ కలుపుకొని తాగారు. పదకొండుమందికి పరీక్షలు చేయగా ఆరుగురికి పాజిటివ్ వచ్చింది. పోలీసులమని చెప్పినా కాల్పులు జరిపారు. రితేష్రెడ్డి రివాల్వర్ స్వాధీనం చేసుకున్నాం. నమిత్ శర్మ కాల్పులు జరిపినట్టు గుర్తించాం. సిమ్లాలో కొకైన్ కొన్నట్టు కౌశిక్ అంగీకరించాడు. రోహిత్రెడ్డి ఆహ్వానం మేరకే పార్టీకి వచ్చారని పోలీసుల ఎఫ్ఐఆర్ లో పేర్కొన్నారు.

### లాయర్ల రక్షణ చట్టం కోసం

## ఇందిరా పార్కు వద్ద దీక్ష

**హైదరాబాద్:** న్యాయవాదుల భద్రత కోసం అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్లోని ఇందిరా పార్క్ వద్ద ఒక రోజు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్. కృష్ణయ్య ఈ దీక్షకు మద్దతు తెలిపారు. ఓబీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, హైకోర్టు అడ్వకేట్ బి.ఆర్. కృష్ణ ముదిరాజ్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే లాయర్ల రక్షణ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో ఉన్న న్యాయవాదులపై దాడులు పెరుగుతున్నాయని, వారికి రక్షణ కల్పించడం ప్రభుత్వ బాధ్యతని నేతలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంజనేయులు గౌడ్ తో పాటు పలువురు హైకోర్టు న్యాయవాదులు పాల్గొని తమ సంఘీభావాన్ని ప్రకటించారు.

### ఒంటిమిట్టలో నిరంతరాయంగా

## అన్నప్రసాదాల వితరణ

**– టిటిడి ఛైర్మెన్ బీఆర్ నాయుడు**



**ఒంటిమిట్ట / తిరుపతి, 2026, మార్చి 16.** ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి వారి దర్శనార్థం వచ్చే భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు పంపిణి చేస్తామని టిటిడి ఛైర్మెన్ బీఆర్ నాయుడు వెల్లడించారు. ఒంటిమిట్టలోని పరిపాలనా భవనంలో ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు ఒంటిమిట్టలో శ్రీకోదండ రామస్వామిబ్రహ్మోత్సవాలు ఈనెల 27వ తేదీ నుండి ఏప్రిల్ 5 తేదీ వరకు 9 రోజులు పాటు వైభవంగా నిర్వహిస్తామన్నారు.– రాష్ట్ర విభజన అనంతరం శ్రీరామనవమి ఉత్సవాలు ఒంటిమిట్టలో రాష్ట్ర పండుగ నిర్వహిస్తున్నాం– టిటిడి ఆధ్వర్యంలో 2016 నుంచి శ్రీరామ నవమి ఉత్సవాలు శ్రీ రాముల వారి కళ్యాణం నిర్వహిస్తున్నాం. – 14వ శతాబ్దంలో ఆలయ నిర్మాణం ప్రారంభమై 17వ శతాబ్దంలో ముగిసిందని శాసనాలు చెబుతున్నాయి– క్రీ. శ 1356లో బుక్కరాయలు ఈ ఆలయాన్ని నిర్మాణం ప్రారంభించారు– విజయనగర రాజులు అంతరాలయము ,రంగ మండపం ,మహా ప్రాంగణం గోపురం నిర్మించారు ఏప్రిల్ 1 తేదీ సీతారాముల కల్యాణానికి విస్తృత ఏర్పాట్లు – రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పట్టు వస్త్రాలు సమర్పిస్తారు– శ్రీ సీతారాముల కల్యాణానికి విచ్చేసేభక్తులకు ఉచితంగా రూ. 50 విలువగల శ్రీవారి లడ్డు ప్రసాదాన్ని అందిస్తాం.– భక్తులకు అన్నప్రసాదాలు త్రాగు నీరు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణి చేస్తాం – జిల్లా అధికారులు, టిటిడి సమన్వయంతో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు చేస్తున్నాం. – శ్రీ సీతారాముల కళ్యాణాన్ని ప్రపంచవ్యాప్తంగా వీక్షించడానికి ఎస్వీబీసీ ద్వారా ప్రత్యక్ష ప్రసారాలు అందిస్తాం.– రూ. 4 కోట్ల రూపాయలతో విద్యుత్ దీపాలంకరణ ఎల్ఈడి , పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాటు– రూ. 20. 17 కోట్లతో 108 అడుగుల జాంబవంతుడు విగ్రహం నిర్మించేలా చర్యలు చేపడుతున్నాం– మాస్టర్ ప్లాన్ లో భాగంలో 37 కోట్లతో 100 గదులు నిర్మిస్తున్నాం– ముఖ్యమంత్రినారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ఈరోజు నుంచి ఒంటిమిట్టలో భక్తులకు మూడు పూటలా అన్నప్రసాదాలు అందిస్తున్నాం. అన్నప్రసాద వితరణ కేంద్రాన్ని ప్రారంభించిన టిటిడి ఛైర్మెన్ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామాలయానికి ఎదురుగా ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కేంద్రాన్ని టిటిడి ఛైర్మెన్ బీఆర్ నాయుడు ప్రారంభించారు. గత ఏడాది శ్రీ సీతారాముల కల్యాణోత్సవం సందర్భంగా ఒంటిమిట్టకు విచ్చేసే భక్తులకు అన్నప్రసాదాలను నిరంతరంగా అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన సూచనల మేరకు అన్నప్రసాద కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. భక్తులకు అన్నప్రసాదాలను అందించేందుకు జర్మన్ షెడ్ ను ఏర్పాటు చేశారు. అందులో భక్తులు కూర్చుని అన్నప్రసాదాలు స్వీకరించేలా ఏర్పాట్లు చేశారు. ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి వారిని దర్శించుకున్న టిటిడి ఛైర్మెన్అంతకుముందు శ్రీ కోదండరామ స్వామి వారి ఆలయంలో స్వామివారిని టిటిడి ఛైర్మెన్ బీఆర్ నాయుడు దర్శించుకున్నారు. ఆలయం వద్దకు రాగానే ఆలయ అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం టిటిడి ఛైర్మెన్ కు తీర్థప్రసాదాలను అందించారు. కల్యాణ వేదికను పరిశీలించిన టిటిడి ఛైర్మెన్ఏప్రిల్ 1న జరుగనున్న శ్రీ సీతారాముల కల్యాణోత్సవానికి చేస్తున్న ఏర్పాట్లను టిటిడి ఛైర్మెన్ పరిశీలించారు. భక్తులకు సౌకర్యవంతంగా ఏర్పాట్లు చేపట్టాలని ఆయన అధికారులకు సూచించారు. కల్యాణ వేదిక ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, భద్రతా, అన్నప్రసాదాల పంపిణీ, కల్యాణాన్ని భక్తులు ఆనందంగా వీక్షించేలా ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు.

## నా భర్త నాకు కావాలి....

**– భర్త కోసం భార్య పోరాటం.**

**తాడేపల్లి** కుంచనపల్లిలోని భర్త నివాసం ముందు కుటుంబ సభ్యులతో కలసి భార్య నిరసన కు దిగింది. కాపురానికి తీసుకువెళ్లాలని భర్త ఇంటి ముందు ధర్నా చేసింది. కృష్ణా జిల్లా పామర్రుకు చెందిన చైతన్య అనే యువతితో గుంటూరు జిల్లా మందడంకు చెందిన యర్రంనేనీ విజయ్ తో 2017లో వివాహం జరిగింది. ప్రెగ్నెన్సీ రావడంతో తనకు ఇష్టం లేని పెళ్లి చేశారంటూ... పెళ్లి అయిన 8 నెలలకే భార్య చైతన్యను భర్త విజయ్ వదిలేసాడు. భర్త కోసం 8 సంవత్సరాలుగా పోరాటం చేస్తున్న తనకు అత్తమామలు న్యాయం చేయడం లేదని భార్య ఆవేదన చెందుతోంది. తమకు పుట్టిన బిడ్డకు న్యాయం చేయాలని భర్త ఇంటి ముందు ధర్నా కు దిగింది. భార్యను కాపురానికి తీసుకువెళ్లాలని న్యాయస్థానం నుంచి ఆర్డర్ వచ్చిన కోర్టు ఆర్డర్ ను భర్త, అత్తమామలు పట్టించు కోవడంలేదని అంటోంది. వేరే మహిళతో సహజీవనం చేస్తూ తనని , బిడ్డని పట్టించుకోవడం లేదని ఆరోపించింది.

## పొట్టి శ్రీరాములు విగ్రహావిష్కరణ

**విజయవాడ,** ఏపీ రాజధాని అమరావతిలో ఒక మహోన్నతమైన ఘట్టం ఆవిష్కృతమైంది. తెలుగు జాతి ఆత్మగౌరవానికి, ప్రాణత్యాగానికి నిలువుటద్దంగా నిలిచిన అమరజీవి పొట్టి శ్రీరాముల 125వ జయంతి సందర్భంగా తుళ్లూరు సమీపంలోని శాఖమూరు పార్కు సమీపంలో 58 అడుగుల భారీ కాంస్య విగ్రహాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు. ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన 58 రోజుల ఆమరణ దీక్షకు గుర్తుగా ఈ విగ్రహాన్ని సరిగ్గా 58 అడుగుల ఎత్తులో రూపొందించడం విశేషం.

ఈ వేడుకలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, రాష్ట్ర మంత్రులు లోకేశ్, నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేశ్, టీజీ భరత్, ఏపీ బీజేపీ అధ్యక్షుడు మాధవ్ తదితరులు పాల్గొన్నారు. సుమారు 6.8 ఎకరాల విస్తీర్ణంలో రూ.150 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న ఈ 'స్మృతివనం'లో కేవలం విగ్రహమే కాకుండా, ఒక మ్యూజియం, ఆడిటోరియం, ఫొటో గ్యాలరీని కూడా ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, పొట్టి శ్రీరాముల త్యాగ ఫలమే నేటి ఆంధ్ర రాష్ట్రమని, ఆయన స్ఫూర్తిని భావితరాలకు అందించడమే ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.

## బుద్ధానగర్లో తలసాని పర్యటన

**– ఎమ్మెల్యే తలసాని**

**సికింద్రాబాద్** అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ ప్రజల సమస్యలను పరిష్కరించాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశించారు. సోమవారం ఆయన అమీర్ పేట లోని బుద్ధానగర్ లో వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలను సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. కాలనీలో నూతనంగా చేపట్టిన స్ట్రామ్ వాటర్ లైన్ పనులను పరిశీలించారు. స్ట్రామ్ వాటర్ లైన్ నిర్మాణ పనులు సక్రమంగా జరగడం లేదని, లెవెల్స్ ప్రకారం పైప్ లైన్ ఏర్పాటు చేయడం లేదని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కు వివరించారు. నిర్మాణ సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోకపోతే భవిష్యత్ లో తాము ఇబ్బందులకు గురి కావాల్సి ఉంటుందని ఈ సందర్భంగా స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్ట్రామ్ వాటర్ లైన్ పనుల తో డ్రైనేజీ లైన్ కూడా దెబ్బతిన్నదని, మరమ్మతులు చేసేలా చూడాలని కోరారు. అదేవిధంగా తమ కాలనీలో ఉన్న ఇనుప విద్యుత్ స్తంభాలను తొలగించి వాటి స్థానంలో సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ స్ట్రామ్ వాటర్ లైన్ పనుల అనంతరం ఇబ్బందులు తలెత్తకుండా ముందుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా దెబ్బతిన్న డ్రైనేజీ లైన్ మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. స్ట్రామ్ వాటర్, డ్రైనేజీ లైన్ లు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసిన తర్వాతనే రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. విద్యుత్ స్తంభాలు కూడా వెంటనే ఏర్పాటు కు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు కూడా అభివృద్ధి పనులలో అధికారులకు తమవంతు సహకారం అందించాలని చెప్పారు. తాను ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్న విషయం నియోజకవర్గ ప్రజలకు అందరికీ తెలిసిందేనని చెప్పారు.

## శ్రీరామ్ వేధింపులను నిలువరించండి

**– బాధితుడు కృష్ణ చైతన్య**

శ్రీరామ్ సంస్థ వేధింపుల నుంచి తమను కాపాడాలని బాధితుడు కృష్ణ చైతన్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తన గోడును మీడియాకు వివరించారు. వ్యాపార అవసరాల నిమిత్తం భువనగిరి శ్రీరామ్ ఫైనాన్స్ లో తాను రుణాన్ని తీసుకున్నట్లు తెలిపారు. సదరు సంస్థ సూచించిన విధంగా ప్రతినెల వాయిదాల పద్ధతిలో రుణాన్ని తిరిగి చెల్లించినప్పటికీ తనను తీవ్రంగా వేధిస్తుందని ఆరోపించారు. సంస్థ లీగల్ అడ్వైజర్ శ్రీనివాస్ రెడ్డి తనతో పాటు తనకు షూరిటీగా ఉన్న సంతోష్ కుమార్ ను తీవ్రంగా మానసిక ఒత్తిడికి గురి చేశారని ఆరోపించారు. సంస్థ వేధింపుల కారణంగానే అనారోగ్యానికి గురైన సంతోష్ కుమార్ ఇటీవలే చికిత్స పొందుతూ నిమ్స్ ఆసుపత్రిలో మృత్యువాత పడ్డాడని కన్నీరు పెట్టుకున్నారు. ఈ విషయంపై తాను ఆర్బీఐ కి ఫిర్యాదు చేసినా వేధింపులు ఆగలేదని వాపోయారు. రుణ గ్రహీతలను మానసికంగా వేధింపులకు గురి చేస్తున్న ఫైనాన్స్ సంస్థలపై కఠినమైన చర్యలు తీసుకొని తమలాంటి వారికి న్యాయం చేయాలని కోరారు.

### అవినీతి పనులకు కేరాఫ్ అడ్రస్

## వంకెల బ్రదర్స్

**– తన తండ్రిని హత్య చేసేందుకు ప్రయత్నిస్తున్నారు**

**– ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేసాం**

**– బద్వేల్ మాజీ జడ్పిటిసి బీరం శిరీష**



**బద్వేలు** పేద రైతుల పొట్ట కొట్టి సొసైటీ సొమ్ము తిన్న దొంగలు పోల్ రెడ్డి బ్రదర్స్ అని బద్వేల్ మాజీ జెడ్పిటిసి సభ్యురాలు బీరం శిరీష ఆరోపించారు సోమవారం బద్వేల్ లో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు కోర్టులో స్టే తెచ్చుకుని ఇంతకాలం తప్పించుకున్నారు డిసిసి బ్యాంక్ చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి చొరవతో విచారణ ముందుకెళుతుంటే గగ్గోలు పెడుతున్నారు తప్పే చేయలేదని మాట్లాడుతున్న పెద్దపోలి రెడ్డి విచారణను ఎదుర్కోవడానికి ఎందుకు భయపడుతున్నారు. కోట్ల రూపాయల సొసైటీ సొమ్ము తిన్న ఆధారాలు కళ్ళముందు కనిపిస్తున్నా కక్ష సాధింపు అంటూ బుకాయించడం ఎందుకు..? అరెస్టును జీర్ణించుకోలేని పోలి రెడ్డి మా తండ్రి హత్య కుట్ర చేస్తున్నారు. ఆధారాలతో పోలీసులకు ఫిర్యాదు చేశాం గడిచిన సర్పంచ్ ఎన్నికల్లో గోల్మాల్ చేసి గెలిచిన పోలిరెడ్డి బ్రదర్.. ఇప్పుడు నీతులు మాట్లాడుతున్నారు గడిచిన జడ్పిటిసి ఎన్నికల్లో టిడిపి ఏజెంట్ పారాలను కొనుక్కున్న చరిత్ర మీది కాదా..? బద్వేల్ నియోజక వర్గ టీడీపీ నాయకులు కుమ్మక్కై ఇంతకాలం తప్పించుకున్నారు. ఇకపై మీ ఆటలు సాగవు..అక్రమాలు చేసిన పోల్ రెడ్డి బ్రదర్స్ ను వెనకేసుకొస్తున్న ఎమ్మెల్సీ గోవిందరెడ్డి మా పార్టీ నాయకుల పై విమర్శలు చేస్తున్నారు వీళ్ళు చేసిన అక్రమాలన్నీ సొసైటీ పుస్తకాల్లో నిక్షిప్తమై ఉన్నాయి. రెడ్ బుక్కు రాజ్యాంగం అంటూ గగ్గోలు పెడుతున్న గోవిందరెడ్డి మీ నాయకులు చేసిన అక్రమాలు మీకు తెలియవా..? తప్పు చేసిన ఏ ఒక్కరూ తప్పించుకోలేరు. పోలి రెడ్డి బ్రదర్స్ శిక్ష అనుభవించక తప్పదని ఆమె హెచ్చరించారు

## పంట పొలాల్లోకి దూసుకు వెళ్లిన కారు.

**– నలుగురికి స్వల్ప గాయాలు.**



**రుద్రవరం** మండలంలోని ముత్తలూరు గ్రామ మెట్ట సమీపంలో కారు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకు వెళ్ళింది. ఈ ప్రమాదంలో నలుగురికి స్వల్ప గాయాలు అయ్యాయి. గ్రామస్తులు వివరాల మేరకు ఆదివారం రాత్రి అహోబిలం వైపు నుంచి ఆళ్లగడ్డ కు వస్తున్న కారు ముత్తలూరు మెట్ట మలుపు దగ్గర అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది అన్నారు. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురికి స్వల్ప గాయాలు అయినట్లు గ్రామస్తులు తెలిపారు. గాయపడిన వారిని 108 వాహనం ద్వారా ద్వారా ఆళ్లగడ్డ ప్రభుత్వఆసుపత్రికి తరలించారు అన్నారు. కారులో ప్రయాణిస్తున్న వారు తెలంగాణ వాసులుగా తెలుస్తోంది. ప్రమాదంలో కారు పూర్తిగా దెబ్బతిన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

### సామూహిక హత్యాచారం కేసులో

## రాజమండ్రి జిల్లా కోర్టు కీలక తీర్పు

**– నలుగురు నిందితుకు యావజ్జీవ కారాగార శిక్ష**

**రాజమండ్రి** 2024లో తూర్పు గోదావరి జిల్లా కడియంలో ఓ మహిళపై సామూహిక హత్యాచారం కేసులో రాజమండ్రి జిల్లా కోర్టు కీలక తీర్పు వెలువరించింది. నలుగురు నిందితుకు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. మహిళ నర్సరీలో పని ముగించుకొని ఇంటికి వెళు తుండగా.. నిందుతులు ఆమెపై దారుణంగా అత్యాచారానికి పాల్పడి అనంతరం ఆమెను హత్య చేశారు. ఆ తర్వాత మృతదేహాన్ని కాలువలో పడేశారు. ఈ కేసుపై పలు దశల్లో విచారణ చేపట్టిన న్యాయస్థానం నిందితులు నలుగురికి యావజ్జీవ కారాగార శిక్షను విధించింది.

### సనాతన సాంప్రదాయ పరిరక్షణలో

## శ్రీ వైష్ణవుల పాత్ర ప్రశంసనీయం"




**హైదరాబాద్** విశ్వవ్యాప్తంగా, ముఖ్యంగా తెలంగాణలో శ్రీవైష్ణవులు భగవత్ సేవ ద్వారా, సనాతన సాంప్రదాయాన్ని పరిరక్షిస్తూ, ప్రజలలో భక్తి భావను పెంపొందించేందుకు అవిరళంగా కృషి చేయడాన్ని ప్రశంసిస్తూ శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీరామచంద్ర రామానుజ జీయర్ స్వామివారు మంగళాశాసనాలను అందించారు. యస్.వి.యస్. ట్రస్ట్ సౌజన్యంతో శ్రీవైష్ణవ సేవా రాష్ట్ర సంఘం, స్వస్తి శ్రీ పరాభవనామ సంవత్సర "ఉగాది ఉత్సవాలు" మరియు "డైరీ– మరియు పంచాంగం" ఆవిష్కరణ కార్యక్రమాన్ని యల్.బి.నగర్లోని యస్.వి.యస్. ట్రస్ట్ వారి "శ్రీవైష్ణవ సదనం"లో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈకార్యక్రమంలో ముఖ్య అతిథులుగా దేవిరెడ్డి సుధీర్ రెడ్డి యం.యల్.ఏ. యల్.బి.నగర్,, వేముల శ్రీనివాస్ , ముఖ్యమంత్రి ఓ.యస్.డి. గారలు సమావేశంలో పాల్గొని సందేశాలిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచరాత్రిగమము, ఉభయ వేదాంత పండిత, వేద పండిత, ధార్మిక సాంప్రదాయం సాహిత్యం, మనుష్య యాజ్ఞికం, శ్రీ వైష్ణవ సంప్రదాయ సేవ లాంటి విషయాల్లో ప్రముఖులైన పండితులను "పండిత పురస్కారాలతో" (శ్రీమాన్ గోవర్ధనగిరి జగన్నాథచార్యులు, మరింగంటి కుశేఖరాచార్యులు, మరిగంటి గోవర్ధనాచార్యులు, సుదర్శనం శ్రీనివాసాచార్యులు, అద్దంకి శ్రీనివాస్, దరిపెల్లి లక్ష్మణాచార్యులు, శ్రీముడుంబై లక్ష్మి నరసింహాచార్యులు తదితరులకు) ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఛైర్మన్ కె. యాదగిరాచార్యులు, ప్రధానకార్యదర్శి సి.హెచ్. లక్ష్మీనాథాచార్యులు, శ్రీ భాష్యం యదుమోహన్, శ్రీ వైష్ణవ సేవా రాష్ట్ర సంఘ అధ్యక్షులు తిరువరంగం ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి పీచర కృష్ణమాచార్యులు, వర్కింగ్ ప్రెసిడెంట్ డింగరి రవి, అదనపు ప్రధాన కార్యదర్శి సత్యనారాయణాచార్యులు, గోవర్ధనగిరి అనంతాచార్యులు, చక్రవర్తుల రామకృష్ణమాచార్యులు, శేషం వెంకటాచార్యులు, కోశాధికారి పవన్, ట్రస్ట్ సభ్యులు డా? సి.హెచ్. రమణాచార్యుల, శరగోపాచార్యులు, నరేంద్రాచార్యులు, మాధవాచార్యులు, వరదాచార్యులు మరియు సంఘ నాయకులు రామకృష్ణచార్యులు, ఫణిహారం శ్రీకాంత కృష్ణమాచార్యులు ప్యారక అరుణ, డింగరి శ్రీకాంత్, నందకిశోర్ తదితరులు 33 జిల్లాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సమావేశం, ఈ క్రింది తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించింది. బ్రహ్మణ పరిషత్కు పాలకవర్గాన్ని వెంటనే నియామకం చేయాలి. బ్రాహ్మణ పరిషత్లో 50% పదవులను శ్రీ వైష్ణవులకు కేటాయించాలి. తెలంగాణలో ప్రభుత్వం నియామకం చేస్తున్న దేవాలయాల పాలకవర్గాలలో బ్రాహ్మణులతో సమానంగా శ్రీవైష్ణవులకు కూడా నియామకం చేయాలి. గ్రామాలు, మండల కేంద్రాలు, జిల్లాల్లో నివసించే శ్రీవైష్ణవ పురోహితులకు, అర్చకులకు ఇండ్ల స్థలాలు కెటాయించి, గృహాలను మంజూరి చేయాలి. ప్రభుత్వ దేవాలయాల్లో పనిచేసే దూపదీప నైవేద్య అర్చకులకు కల్పిస్తున్న "భీమా సౌకర్యం" మరియు "వైద్య సౌకర్యాలను" ప్రైవేట్ దేవాలయాల్లో పనిచేసే అర్చకులకు, పురోహితులకు కూడా వెంటనే వర్తించే విధంగా తగు ఉత్తర్వులను విడుదల చేయాలి.

### అమరజీవి పొట్టి శ్రీరాములు గారి

## జయంతి వేడుకలు



**శిరివెళ్ల** ఆంధ్ర విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో చాగలమరి మండలం శ్రీ అమరజీవి పొట్టి× శ్రీరాములు గారి జయంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళు లర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్ర విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి లక్కు కార్తీక్ మరియు మండల అధ్యక్షుడు పూజనబోయిన వంశీ మాట్లాడుతూ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణ త్యాగం చేసినటువంటి మహనీయుడు అని అన్నారు×పొట్టి శ్రీరాములు 1930లో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని జైలుశిక్ష అనుభవించాడు. తర్వాత మళ్ళీ 1941–1942 సంవత్సరాల్లో సత్యాగ్రహాలు, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొనడం వల్ల మూడుసార్లు జైలుశిక్ష అనుభవించాడు. 1985లో ప్రచురింప బడిన ఆంధ్ర ఉద్యమం కమిటీ అధ్యయనంలో పొట్టి శ్రీరాములు – మహాత్మా గాంధీల మధ్య అనుబంధం గురించి ఇలా వ్రాయబడింది. – "సబర్మతి ఆశ్రమంలో శ్రీరాములు సేవ చరిత్రాత్మకమైనది. ప్రేమ, వినయం, సేవ, నిస్వార్థత లు మూర్తీభవించిన స్వరూపమే శ్రీరాములు. అతని గురువు ప్రపంచానికే గురువు, సత్యాన్ని అహింసను ఆరాధించే ప్రేమమూర్తి. దరిద్ర నారాయణుల ఉద్ధతికి అంకితమైన మహానుభావుడు..... శ్రీరాములు తన కర్తవ్య దీక్షలను ఉత్సాహంగా నిర్వహిస్తూ ఆశ్రమంలో అందరి మన్ననలనూ, కులపతి (గాంధీ) ఆదరాన్నీ చూరగొన్నాడు. అని అన్నారు ఈ కార్యక్రమంలో ఆంధ్ర విద్యార్థి సంఘం కో కన్వీనర్ విష్ణు పవన్ ఆంధ్ర విద్యార్థులు సంఘం కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఒబేసిటీ పై అవగాహన రావాలి

**– కలెక్టర్ హరిచందన**

**సికింద్రాబాద్.** ఒబేసిటి పైన ప్రజల్లో విస్తృతంగా అవగాహణ తీసుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని హైద్రాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరి చందన స్పష్టం చేశారు. సికింద్రాబాద్ లోని మెడికవర్ హాస్పిటల్ లో నూతనంగా ఏర్పాటు చేసిన ఒబేసిటీ క్లినిక్ కలెక్టర్ ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న పిల్లల్లో కూడా ఒబేసిటీ సమస్య ఏర్పడుతుందని ఇది కేవలం ఆహారపు అలవాట్లతోనే కాకుండా హార్మోన్లు, ఇతర కారణాలు కూడా ఉంటాయని తెలిపారు. వీటన్నిటి కారణంగా భారత్ మధుమేహ వ్యాధిగ్రస్తులకు రాజదానిగా మారబోతుందని పేర్కొన్నారు. గుండె సమస్యలకు, లివర్ సమస్యలకు, క్యాన్సర్ కి అన్నిటికీ ఉభయకాయం వల్ల ఏర్పడిన కొవ్వె కారణంగా తేలుతుందని చెప్పారు. శరీరంలో ఏదైనా సమస్య వచ్చినప్పుడే వైద్యుల దగ్గరకు వెళుతున్నారని కానీ ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం చేయడం లేదని వెల్లడించారు. ప్రజల్లో అటువంటి చైతన్యం తీసుకు రావడానికి చర్యలు చేపట్టాలని సూచించారు.

# ఇండో యూఎస్ ట్రేడ్ డీల్ కు వ్యతిరేకంగా నిరసనలు





**ఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ఇండో యూస్ ట్రేడ్ డీల్ కి వ్యతిరేకంగా జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్ పిలుపుతో తెలంగాణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ ఆదేశాల మేరకు తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా అధ్యక్షులు నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని డిల్లీ లోని జంతర్ మంతర్ వద్ద భారత దేశ ప్రధాని నరేంద్ర మోడీ అమెరికా తో చేసుకున్న ఒప్పందానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు.తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మహబూబ్నగర్ జిల్లా ఇంచార్జ్ శివంత్ రెడ్డి మాట్లాడుతూ అమెరికా న్యూయార్క్ ఫెడరల్ కోర్టులో వ్యాపారవేత్త గౌతమ్ అదానిపై జరుగుతున్న కేసులు వేగంగా ముందుకు సాగుతున్న సమయంలోనే ఈ ఒప్పందం కుదిరిందని వార్తలు వెలువడుతున్నాయి. అదే సమయంలో అంతర్జాతీయంగా ఎప్స్టీన్ ఫైల్స్‌కు సంబంధించిన సమాచారం బయటకు వస్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అత్యవసరంగా ఇండో యూస్ ట్రేడ్ ఒప్పందాన్ని కుదుర్చుకోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఈ ఒప్పందం ద్వారా అమెరికా వ్యవసాయ ఉత్పత్తులకు భారత మార్కెట్‌ను విస్తృతంగా తెరవడం వల్ల దేశంలోని కోట్లాది రైతుల జీవనోపాధి ప్రమాదంలో పడే అవకాశం ఉంది. వ్యవసాయం భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తూ సుమారు 60 శాతం ప్రజలకు ఉపాధి కల్పిస్తోంది.అదే విధంగా దేశ ఇంధన భద్రతకు సంబంధించిన అంశాలు కూడా ఆందోళన కలిగిస్తున్నాయి. రష్యా లేదా ఇరాన్ వంటి దేశాల నుండి తక్కువ ధరకు లభించే చమురు కొనుగోళ్లపై పరిమితులు విధిస్తే, అది దేశ ఆర్థిక వ్యవస్థపై నేరుగా ప్రభావం చూపే ప్రమాదం ఉంది.ఇంకా ఒక వైపు అమెరికా ఉత్పత్తులు భారత మార్కెట్‌లో తక్కువ లేదా సున్నా సుంకాలతో ప్రవేశించే అవకాశం ఉండగా భారత ఉత్పత్తులపై అమెరికా అధిక సుంకాలు విధించడం అన్యాయంగా కనిపిస్తోందన్నారు.

# శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం





**తిరుపతి(ప్రశ్న న్యూస్)** శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో మార్చి 19వ తేదీ ఉగాది ఆస్థానం పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా జరిగింది. తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి తోమాలసేవ, సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం ఉదయం 7 నుండి 9 గంటల వరకు శ్రీ గోవిందరాజస్వామివారి సన్నిధి, శ్రీ పార్థసారథి స్వామివారి సన్నిధి, శ్రీ ఆండాల్ అమ్మవారు, శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి, శ్రీ పుండరికవల్లీ ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేసిన అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం ఉదయం 9.30 గంటల నుండి భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో శాంతి, ఏఈవో నారాయణ చౌదరి, సూపరింటెండెంట్ చిరంజీవి, అర్చక బృందం పాల్గొన్నారు.

## జనసేన ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా చీరల పంపిణీ



నాచారం(ప్రశ్న న్యూస్) జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని పార్టీ శ్రేణులు ఉప్పల్ నియోజకవర్గం లోని నాచారం డివిజన్ లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జనసేన నాయకులు కలగ సర్వేశ్ ఆధ్వర్యంలో అరుణ కుమారి సహకారం తో మహిళలకు,వికలాంగులకు చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మల్కాజ్ గిరి మేడ్చల్ కో ఆర్డినేటర్ మచ్చ సుధాకర్,వీర మహిళా విభాగం మాజీ వైస్ చైర్మెన్ రత్న పిల్లా పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద మరియు ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు సహాయం చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా పలువురు మహిళలకు చీరలను అందజేసి వారి ఆశీర్వాదాలు పొందమని తెలిపారు. పార్టీ స్థాపన నుంచి ప్రజా సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని అన్నారు. ప్రజల సంక్షేమం కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని తెలిపారు.కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కొల్లు నరేష్ నాయుడు,ఎల్బీనగర్ సంతోష్ నాయక్,శర్మ,బేతుల సంతోష్ కుమార్, నార్ని కుమార్, సదానంద్ ,రాజు,విజయ్,శ్రవణ్, అస్మత్ ఉల్లా ఖాన్,మధు,సోమ శ్రీనివాస్,కామరుద్దిన,షేక్ అజీమ్,లక్ష్మీ ప్రియ,రోజా,విజయకుమారి, వాణిశ్వరి, కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్లు.. పొంగులేటి ఆదేశాలు



తెలంగాణ (ప్రశ్న న్యూస్)హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవసరమైన కార్యాచరణను సిద్ధం చేయాలనిమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నగరంలో నివసించే పేద ప్రజల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా స్థలాలను గుర్తించాలని సూచించారు. సోమవారం మంత్రులతో కలిసి సమీక్షలో మాట్లాడారు. పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలని.. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గొద్దని ఆదేశాలు జారీ చేశారు.

# మెడికల్ కాలేజీలో భారీ అగ్నిప్రమాదం

**కటక్** కటక్లోని ఎస్సీబీ మెడికల్ కాలేజ్లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ట్రామాకేర్ విభాగంలో మంటలు చెలరేగి, పది మంది మృతి చెందారు. ప్రమాదంలో మరో 11 మందికి గాయాలు అయ్యాయి. సిబ్బంది రోగులను రక్షించి ఇతర వార్డులకు తరలించారు. దట్టమైన పొగతో 23 మంది సిబ్బంది అస్వస్థతకు గురయ్యారు. ప్రమాదంపై ఒడిశా సీఎం మోహన్ చరణ్‌గ్ర్భాంతి వ్యక్తం చేసారు. మృతుల కుటుంబాలకు రూ.25లక్షల చొప్పున ఎక్స్గ్రేషియా ప్రకటించారు. ఆస్పత్రిలో క్షతగాత్రులను సీఎం పరామర్శించారు. గాయపడ్డవారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ఘటనపై ఉన్నతస్థాయి విచారణకు సీఎం ఆదేశించారు.

## పదవ తరగతి పరీక్షా కేంద్రాలను

# పరిశీలించిన ఎస్డీపీవో



**చిత్తూరు** 10వ తరగతి పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో పట్టణములోని పలు స్కూళ్ళ పరీక్షా కేంద్రాలను చిత్తూరు ఎస్డీపివో టి.సాయినాథ్ పరిశీలించారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలను పరిశీలించారు. జిల్లా అధికారులు జిల్లా అంతటా పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్త్ ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. సోమవారం నుండి 10వ తరగతి వారికి పరీక్షలు మొదలైన సందర్భంగా చిత్తూరు ఎస్డీపీవో పట్టణములోని శ్రీచైతన్య, నారాయణ, లిటిల్ ఫ్లవర్ మరియు గిరింపేట లోని మునిసిపల్ హై స్కూల్స్ ల పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షా హాల్లు, విద్యార్థులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. టి. సాయినాథ్ మాట్లాడుతూ, పదవ తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా పోలీసు శాఖ తరఫున పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రత్యేకంగా పోలీసులు పర్యవేక్షణ కొనసాగిస్తారని చెప్పారు.

## మొబైల్ ఫోన్ దుకాణాలపై

# విజిలెన్స్ దాడులు



**ఏలూరు** ఏలూరు నగరంలో మరోసారి విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు మొబైల్ యాక్సెసరీస్ దుకాణాలపై సోమవారం దాడులు నిర్వహించారు.ఏలూరు ఆర్ ఆర్ పేట లోని మహదేవ్ మొబైల్స్ లో ఒరిజినల్ పేరుతో డూప్లికేట్ అమ్ముతున్నారు అన్న సమాచారంతో ఆ దుకాణంలో ప్రస్తుతం తనిఖీలు నిర్వహిస్తున్నారు. సెల్ ఫోన్ యాక్సెసరీస్ కు సంబంధించిన బిల్లులను ఒరిజినల్ సామాగ్రి వివరాలను వారు సేకరిస్తున్నారు తనిఖీలు కొనసాగుతున్నాయి

# భారత్లో తీరనున్న గ్యాస్ కష్టాలు

## - ఖతార్ నుంచి భారత్కు చేరుకున్న శివాలిక్ నౌక

**ముంబాయి** ఇరాన్ హర్మూజ్ జలసంధి దాటి గుజరాత్లోని ముంద్రా పోర్టుకు శివాలిక్ నౌక చేరుకుంది. షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా యాజమాన్యంలోని ఎల్పీజీ ట్యాంకర్ నౌక శివాలిక్లో సుమారు 40 నుంచి 46 వేల మెట్రిక్ టన్నుల ఎల్పీజీ గ్యాస్ ఖతార్లోని రాస్ లఫాన్ ఓడరేవు నుండి శివాలిక్ బయలుదేరింది. హర్మూజ్ జలసంధి నుంచి ప్రయాణం చేసింది. సోమవారం నాడు గుజరాత్ రాష్ట్రం కచ్ జిల్లాలోని ముంద్రా ఓడరేవుకు చేరుకుంది. రాస్ లఫాన్ నుండి బయలుదేరిన మరో నౌక నందా దేవి ఇప్పటికే గుజరాత్ తీరానికి దూరంగా ఉంది. మంగళవారం ఉదయం 6:30 గంటలకు గుజరాత్లోని కాండ్లా ఓడరేవుకు చేరుకుంటుందని అంచనా. ఈ రెండు నౌకలు కలిపి తీసుకున్న వస్తున్న ఎల్పీజీ గ్యాస్ 92,700 మెట్రిక్ టన్నులు.

# ఉప్పల్ కానిస్టేబుల్ హత్య కేసు

## - ఇద్దరు నిందితుల అరెస్టు

**ఉప్పల్** చిలకనగర్ హత్య కేసును 8 గంటల్లో ఉప్పల్ పోలీసులు ఛేదించారు. ఉప్పల్ లోని డీసీపీ కార్యాలయంలో డీసీపీ సురేష్ కుమార్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆదివారం రాత్రి 8 సమయంలో 100 కాల్ ద్వారా సమాచారం వచ్చింది. చిలకనగర్ ప్రాంతంలో పారువుల సుధీర్ కుమార్ను కత్తితో దాడి చేసి హత్య చేసినట్లు సమాచారం వచ్చింది. సుధీర్ కుమార్ ను హత్య చేసిన ప్రధాన నిందితుడు బనోతు సంతోష్ లు 7సంవత్సరాలుగా స్నేహితులు. వీరి మధ్య మూడు రోజుక క్రితం నుండి విభేదాలు ఏర్పడ్డాయని అన్నారు.మార్చి 15న సాయంత్రం సమయంలో సంతోష్ తన స్నేహితుడు పొడిశెట్టి తరుణ్తో కలిసి సుధీర్ కుమార్ను చిలకనగర్ గ్రౌండ్ వద్దకు పిలిచారు. సుధీర్ తన స్నేహితుడు ఇమ్రాన్ ఖాన్తో కలిసి అక్కడికి వెళ్లిన తర్వాత ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ సమయంలో సంతోష్ కత్తితో సుధీర్పై దాడి చేయాగా, సంతోష్ పారిపోవడానికి తరుణ్ తోడయ్యాడు. సుధీర్ అక్కడి నుంచి తప్పించుకునే ప్రయత్నం చేసినప్పటికీ సంతోష్ వెంబడించి పలుమార్లు కత్తితో పొడవడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన అనంతరం నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. కేసు నమోదు చేసిన ఉప్పల్ పోలీసులు దర్యాప్తు చేపట్టి, కేవలం 8 గంటల్లోనే ప్రధాన నిందితుడు బనోతు సంతోష్, అతని సహచరుడు పొడిశెట్టి తరుణ్ను అదుపులోకి తీసుకున్నాము. నిందితుల వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన కత్తి, రెండు మొబైల్ ఫోన్లు, ఒక యాక్టివా మోటార్ సైకిల్, వారి దుస్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారని అన్నారు.

## బడంగ్ పేట్ మునిసిపల్

# కార్యాలయంలో ఏసీబీ సోదాలు

**రంగారెడ్డి** బడంగ్పేట్ మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు నిర్వహించింది. ఏసీబీ హైదరాబాద్ రేంజ్ టు డీఎస్పీ గంగసాని శ్రీధర్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో సర్ప్రైజ్ చెకింగ్ జరిగింది. శానిటేషన్, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాలపై దాడులు జరిపారు. ఏసీబీ అధికారులు కార్యాలయంలో సోదాలు చేపట్టారు.

# ఎంఈవో కార్యాలయం ముందు ధర్నా

**కూకట్ పల్లి** కూకట్ పల్లి ఎంఈఓ కార్యాలయం ఎదుట టిపివైఎఫ్, యుఎస్ఎఫ్ఐ నేతలు ధర్నా కు దిగారు. న్యూ ఏరా హై స్కూల్ విద్యాశాఖ అధికారితో కలిసి కుమ్మక్కయ్యారంటూ ఆరోపించారు. న్యూ ఎరా స్కూల్ ర్యాంకుల కోసం సెల్ఫ్ సెంటర్లు వేయించుకున్నారని టిపివైఎఫ్, యుఎస్ఎఫ్ఐ ధర్నా చేసారు. మేడ్చల్ జిల్లా డీఈవో, ఎంఈఓ లంచాలు తీసుకుంటూన్నారని టిపివైఎఫ్, యుఎస్ఎఫ్ఐ నినాదాలు చేసారు. ఏరా హైస్కూల్ పరీక్ష కేంద్రాన్ని మార్చాలని డిమాండ్ చేసారు. ఈ తప్పిదానికి పాల్పడిన అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు.

# పెండింగ్ బిల్లులకోసం అసెంబ్లీ ముట్టడి

## - మాజీ సర్పంచుల అరెస్టు

**హైదరాబాద్** సర్పంచుల పెండింగ్ బిల్లులు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సర్పంచుల సంఘం అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చింది. ర్యాలీగా వచ్చిన మాజీ సర్పంచ్లను నాంపల్లి గాంధీభవన్ వద్ద పోలీసులు అడ్డుకొని అరెస్టు చేశారు. తమ సొంత డబ్బులతో మాజీ సర్పంచులు గ్రామాలను అభివృద్ధి చేసిన నిధులను తక్షణమే మంజూరు చేయాలని జేఏసీ చైర్మన్ సుర్వి యాదయ్యగౌడ్ డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రామ పంచాయతీలకు వచ్చే నిధులు... మాజీ సర్పంచులకు బిల్లులు చెల్లించే విధంగా పంచాయతీ సెక్రటరీలకు ఆదేశాలు ఇవ్వాలన్నారు. 2019 నుంచి 2024 వరకు గ్రామాలలో మాజీ సర్పంచులు వడ్డీలకు అప్పులు తెచ్చి గ్రామాలలో అభివృద్ధి పనులు చేసి బిల్లులు రాక అనేకమంది సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించే విధంగా జీవో విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు.

# మేడ్చల్ జిల్లాలో తాగునీటి సమస్యపై బీఆర్ఎస్ నాయకుల ఆగ్రహం

**మేడ్చల్** జీహెచ్ఎంసీ పరిధిలోని 297, 298 డివిజన్లలో మేడ్చల్, పూడూరు, కిష్టాపూర్ ప్రాంతాల్లో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మేడ్చల్ బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు భాస్కర్ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి సమస్యను ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు సరైన పరిష్కారం చూపలేదని మండిపడ్డారు.గత తెలంగాణ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో ప్రజలకు తాగునీరు ఎప్పుడూ అందుబాటులో ఉండేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన మొదటినుంచి పట్టణ ప్రజలకు నీటి సమస్యలు మొదలయ్యాయి అన్నారు. పట్టణ చుట్టుపక్కల గ్రామాల్లో అవసరానికి మించి నీటి సరఫరా జరుగుతుంది కేవలం మేడ్చల్ పట్టణానికే ఈ సమస్య ఎందుకు వొస్తుంది అని ప్రశ్నించారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఖాళీ బిందెలతో పాదయాత్రగా వచ్చి అసెంబ్లీని ముట్టడిస్తామని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు.

# పెట్రోల్ పంపుల్లో నో స్టాక్

## రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని పెట్రోల్ పంపులు

**ఇబ్రహీంపట్నం:** పెట్రోల్ పంపుల్లో నో స్టాక్ బోర్డులు పెట్టడంతో వాహనదారులు గగ్గోలు పెడుతున్నారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని పెట్రోల్ పంపుల్లో సోమవారం స్టాక్ లేకపోవడంతో నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. దీంతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఇబ్రహీంపట్నంలో మొత్తం 10 పెట్రోల్ పంపుల్లో మొత్తం నా స్టాక్ బోర్డులు పెట్టి బంద్ చేశారు.వాహనదారులు వివిధ పనులపై వెళ్లేవారు పెట్రోల్ డీజిల్ లేక ఇబ్బందులకు గురైతున్నారు. పెట్రోల్, డీజిల్ కు ఎలాంటి కొరత లేదని అధికారులు చెప్తున్నప్పటికి పెట్రోల్ పంపుల్లోస్టాక్ లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

# ఇది పరీక్షా కేంద్రమా...

**కడప,** కడప జిల్లా బి. కోడూరు మండలంలోని పదో తరగతి పరీక్షా కేంద్రంలో విద్యార్థులు నిశ్శబ్దంగా పరీక్ష రాస్తున్నారు. ఆ సమయంలో గదిలో ఉన్నట్టుండి వింత శబ్దాలు రావడంతో విద్యార్థులు, సిబ్బంది అప్రమత్తమయ్యారు. గమనించగా.. ఒక పెద్ద పాము గదిలోకి ప్రవేశించినట్లు గుర్తించారు. దీంతో విద్యార్థులు ఒక్కసారిగా భయాందోళనకు గురై, ప్రాణభయంతో పరీక్షా పత్రాలను వదిలేసి గది బయటకు పరుగులు తీశారు.విద్యార్థుల అరుపులతో పరీక్షా కేంద్రం వద్ద గందరగోళం నెలకొంది. వెంటనే స్పందించిన అక్కడి సిబ్బంది ఆ పామును పట్టుకుని చంపివేయడంతో ముప్పు తప్పింది. అనంతరం విద్యార్థులు కాస్త తేరుకుని, మళ్లీ పరీక్షా గదిలోకి వెళ్లి మిగిలిన పరీక్షను పూర్తి చేశారు. ఈ ఘటనపై విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పదో తరగతి పరీక్షలు విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో ముఖ్యమని, ఇలాంటి సమయంలో పాములు రావడం వల్ల పిల్లలు మానసిక ఆందోళనకు గురవుతారని ఆవేదన వ్యక్తం చేశారు.పరీక్షా కేంద్రాలను, వాటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అధికారులపై లేదా అని తల్లిదండ్రులు ప్రశ్నించారు. చదివిందంతా మర్చిపోయేలా ఇలాంటి భయానక సంఘటనలు జరగడం వల్ల విద్యార్థులు పరీక్షలు సరిగ్గా రాసే అవకాశం ఉండదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా విద్యాశాఖ అధికారులు స్పందించి, పరీక్షా కేంద్రాల వద్ద ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పిల్లల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# అట్రాసిటీ,పోక్సో కేసులపై సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి దర్యాప్తు




గంభీరావుపేట (ప్రశ్న న్యూస్ )రాజన్న సిరిసిల్ల జిల్లా, గంభీరావుపేట మండలం నాగంపేట,దేశాయిపేట గ్రామాల్లో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు,పాత పోక్సో కేసులపై సోమవారం సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు.వారి వెంట గంభీరావుపేట ఎస్సై అనిల్ కుమార్,తదితర పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## గ్రామ పరిశుభ్రతకు పారిశుద్ధ్య సిబ్బంది అందిస్తున్న సేవలు అమూల్యం

- నీలోజిపల్లి గ్రామ సర్పంచ్ : అనుముల భాస్కర్
- పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు
- యూనిఫామ్‌లు, సానిటేషన్ సామాగ్రి పంపిణీ




బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, నీలోజిపల్లి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య సిబ్బందికి గౌరవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా అమలు చేస్తున్న 99 రోజుల ఆక్షన్ ప్లాన్ షెడ్యూల్ ప్రకారం సోమవారం గ్రామ సర్పంచ్ అనుముల భాస్కర్ నేతృత్వంలో పారిశుద్ధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, వారికి యూనిఫామ్‌లు, సానిటేషన్ సామాగ్రిని పంపిణీ చేసి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా సర్పంచ్ అనుముల భాస్కర్ మాట్లాడుతూ గ్రామ పరిశుభ్రతను కాపాడడంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర అత్యంత ముఖ్యమని తెలిపారు.గ్రామాన్ని శుభ్రంగా, ఆరోగ్యకరంగా ఉంచేందుకు వారు నిరంతరం కష్టపడుతున్నారని, వారి సేవలు ఎంతో అభినందనీయమని కొనియాడారు.కార్మికుల ఆరోగ్యం కూడా సమానంగా ప్రాధాన్యం కలిగినదే కావడంతో వారికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన యూనిఫామ్‌లు, సానిటేషన్ సామాగ్రి అందజేస్తున్నామని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధిలో పారిశుద్ధ్య సిబ్బంది సేవలను ఎప్పటికీ గౌరవిస్తామని, వారికి అవసరమైన సదుపాయాల కల్పనలో గ్రామపంచాయతీ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కుసుంబ మహేందర్, మాజీ వైస్ ఎంపీపీ కొనుకటి నాగయ్య, వార్డు సభ్యులు కొంకటి కమలాకర్, కుడుకల శ్రీకాంత్, ఉమ్మారెడ్డి అనిల్ రెడ్డి, ఆవుల మల్లయ్య, ఎర్ర నాగరాజు, కొనుకటి చంద్రయ్య, ఎర్ర శ్రీకాంత్, కొనుకటి మహేందర్, కడుదుల నాగరాజు, పంచాయతీ కార్యదర్శి స్వప్న, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నీలోజిపల్లి సర్పంచ్ భాస్కర్ ప్రత్యేక చొరవతో ప్రతీ వీధికి రోడ్డు నెంబర్ల సూచిక బోర్డులు ఏర్పాటు

- గ్రామస్తుల చిరకాల వాంఛ నెరవేర్చినందుకు సంతోషంగా ఉంది
- గ్రామ సంక్షేమాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా
- గ్రామ సర్పంచ్ : అనుముల భాస్కర్



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్ )రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని నీలోజిపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ అనుముల భాస్కర్ ప్రత్యేక చొరవతో గ్రామ అభివృద్ధి దిశగా మరో ముందడుగు వేశారు.గ్రామంలో వీధులను సులభంగా గుర్తించేలా రోడ్డు నెంబర్లను కేటాయించి, వాటికి సంబంధించిన నూతన సూచికా బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం పాలకవర్గ సభ్యుల సమక్షంలో నిర్వహించారు.గ్రామంలోని చాలా వీధులు ఒకే విధంగా ఉండటంతో గ్రామానికి కొత్తగా వచ్చే వ్యక్తులు,అధికారులు అడ్రస్ గుర్తించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తించిన గ్రామ పంచాయతీ ఈ నిర్ణయం తీసుకుంది. సర్పంచ్ భాస్కర్ ప్రత్యేక చొరవతో ప్రతి వీధికి ప్రత్యేకంగా రోడ్డు నెంబర్లు కేటాయించి బోర్డులు ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు గత కొంత కాలంగా ఎదురుచూస్తున్న సమస్యకు పరిష్కారం లభించినట్లైంది.ఈ సందర్భంగా సర్పంచ్ అనుముల భాస్కర్ మాట్లాడుతూ, గ్రామానికి వచ్చే ప్రజలు, అధికారులు మరియు అత్యవసర సేవల సిబ్బంది వీధులను సులభంగా గుర్తించేందుకు ఈ బోర్డులు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడంలో పాలకవర్గం ఎప్పుడూ ముందుంటుందని, భవిష్యత్తులో కూడా గ్రామాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కుసుంబ మహేందర్, మాజీ వైస్ ఎంపీపీ కొనుకటి నాగయ్య, వార్డు సభ్యులు కొంకటి కమలాకర్, కుడుకల శ్రీకాంత్, ఉమ్మారెడ్డి అనిల్ రెడ్డి, ఆవుల మల్లయ్య, ఎర్ర నాగరాజు, కొనుకటి చంద్రయ్య, ఎర్ర శ్రీకాంత్, కొనుకటి మహేందర్, కడుదుల నాగరాజు, గ్రామ పంచాయతీ కార్యదర్శి స్వప్న, తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

# అంకాపూర్ డబుల్ బెడ్ రూమ్ కేటాయింపుల్లో జరిగిన అవకతవకలపై కలెక్టర్‌కి ఫిర్యాదు



నిజామాబాద్(ప్రశ్న న్యూస్ అంకాపూర్ డబుల్ బెడ్ రూమ్ కేటాయింపుల్లో జరిగిన అవకతవకలను సరిచేయాలని జిల్లా ప్రథమ న్యాయమూర్తి అధికార ఆదేశం తేదీ 16 మార్చ్ రోజున ప్రజావాణి కార్యక్రమం కు సిపిఐ ఎంఎల్ ప్రజాపందా మాస్ లైన్ నిజామాబాద్ రూరల్ కామారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా నిజామాబాద్ రూరల్ కామారెడ్డి సంయుక్త జిల్లా కమిటీ కార్యదర్శి, ప్రభాకర్ రాష్ట్రకార్యదర్శి, దేవారం లు మాట్లాడుతూ.....నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ రెవిన్యూ డివిజన్ పరిధిలో అంకాపూర్ గ్రామంలో ఇండ్లు లేని (కిరాయి కుంటున్న) ప్రజలు కెసిఆర్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ భూమి లో గుడిసెలు వేసుకోవడం ప్రయత్నించగా మీరు ఇబ్బందులు పడకండి త్వరలోనే డబుల్ బెడ్ రూమ్ నిర్మించి అర్హులైన వారందరికీ మేము ఇస్తామని నాటి శాసనసభ్యులు హామీ ఇవ్వడంతో గుడిసెలు వేసుకునే ప్రయత్నానికి స్వస్తి పలికారనిగుర్తు చేశారు.ఈ నేపథ్యంలో డబుల్ బెడ్ రూమ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టకపోవడంతో సుమారు 54 మంది హైదరాబాద్ కేసీఆర్ ఫామ్ హౌస్ కి వెళ్లి విజ్ఞాపన చేసుకుందామని ప్రయత్నం చేయగా నాటి శాసనసభ్యులు జీవన్ రెడ్డి మీకు మేము సెక్రటేరియట్లో ముఖ్యమంత్రి ని కల్పిస్తానని తీసుకువెళ్లే అరెస్టు చేయించి పోలీస్ స్టేషన్లో నిర్బందించారు.ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత రావడంతో గత్యంతరం లేని స్థితిలోతర్వాత మేము వెంటనే సర్వే చేయించి డబుల్ బెడ్ రూములు మీకు కేటాయిస్తామని హామీ ఇచ్చి సర్వే చేయించి లబ్ధిదారుల జాబితాలో అందరి పేర్ల జాబితాలో చేర్చారు అని అన్నారు.నిర్మాణం పూర్తి కాకముందే కెసిఆర్ ప్రభుత్వం ఎన్నికల్లో ఓడిపోయింది.గత శాసనసభ్యులు ఓడిపోయారు.గెలిచిన శాసనసభ్యులు పాత జాబితాను పక్కనపెట్టి ఏలాంటి సర్వే లేకుండా పూర్తి చేసిన 96 డబుల్ బెడ్ రూమ్లలో 21 మంది అర్హులు కాని వారినిచేర్చి అర్హులను తొలగించారు.అర్హులకు కేటాయించాలని,నిరాహార దీక్షలు చేసిన రెవెన్యూ అధికారులు స్పందించక మొద్దు నిద్రలో ఉన్నారని ఎద్దేవాచేశారు.దీంతో గత్యంతరం లేక హైకోర్టును ఆశ్రయించగా ఖాళీగా ఉన్న నాలుగు డబుల్ బెడ్ రూమ్ లను సర్వే చేసిన జాబితాలో నలుగురికి ఇవ్వాలని 21 మంది అనహరువులను తొలగించాలని నిర్మాణంలో ఉన్న 28 ఇండ్లలో ఇండ్లను సర్వే జాబితాలో అనుగుణంగా ఉండాలని హైకోర్టు ఆదేశించింది. 40 పూర్తి కావలసిన డబుల్ బెడ్ రూమ్ లను నిబంధనలను పాటించి సర్వే జాబితాలను పరిగణంలోకి తీసుకొని ఫైనల్ చేయాలని కూడా సూచించిందని అన్నారు.

ఈ మేరకు జిల్లా ప్రథమ న్యాయమూర్తి జిల్లా కలెక్టర్ ని కలిసి విషయం వివరించడానికి ప్రయత్నించగా సమాచారమంతా కూడా కలెక్టర్ సేకరించుకున్నారు వెంటనే అధికారులను పిలిచి ఎలాంటి సర్వేలు చేయకుండా కేటాయించడం సరికాదని దీనికి బాధ్యులు ఎవరని అడిగిఎవర్ని సస్పెండ్ చేయాలని అధికారులను హెచ్చరించారు.ఆదర్శ గ్రామమైన అంకాపూర్లో పేదలకు అన్యాయం జరిగిందని దీన్ని సరి చేయకపోతే మరో దఫా ఆందోళనకు దీక్షలకు పూనుకుంటామని గుర్తు చేస్తూ ఈమెరకు కలెక్టర్ న్యాయం చేస్తారని ఒక విశ్వాసం పేదలకు కలిగిందని ఈ సందర్భంగా కలెక్టర్ కి అభినందనలు తెలియజేశారు.

అంకాపూర్ డబుల్ బెడ్ రూమ్ పంపిణీలోజరిగిన అవకతవకల పై విచారణ జరిపి వెంటనే నివేదిక ఇవ్వాలని తప్పుడు పద్ధతులు పాటించిన అధికారులను గుర్తించి నా దృష్టికి తేవాలని అధికారులను ఆదేశించిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు.ఇప్పటికైనా కింది స్థాయి అధికారులు మొద్దు నిద్ర వీడి కలెక్టర్ ఆదేశాన్ని త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా ఆర్మూర్ సంయుక్త మండల కమిటీ కార్యదర్శి కిషన్ అఖిలభారత ఐక్య రైతు సంఘం నాయకులు నిఖిల్, గ్రామస్తులు రఫీ, భోజమ్మ, రాజవ్వ, అబ్బమ్మ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీ గ్రామంలో గ్రంథాలయాలను ఏర్పాటు చేయాలి

- సిపిఎం పార్టీ మండల కన్వీనర్ : గురిజాల శ్రీధర్



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్ )రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయిని పల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో లైబ్రరీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సిపిఎం మండల కన్వీనర్ గురిజాల శ్రీధర్ డిమాండ్ చేశారు. గ్రామాల్లో లైబ్రరీలు ఉంటే విద్యార్థులకు పుస్తకాల ద్వారా విజ్ఞానం పెంపొందించుకునే అవకాశం కలుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల గ్రామాల్లో మద్యం బెల్ట్ షాపులకు ఇచ్చినంత ప్రాధాన్యత విద్యార్థులకు విజ్ఞానం అందించే లైబ్రరీలకు ఇవ్వడం లేదని విమర్శించారు. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడిచినా కూడా చాలా గ్రామాల్లో లైబ్రరీలు ఏర్పాటు కాకపోవడం దురదృష్టకరమన్నారు.పాలకులు చిత్తశుద్ధితో వ్యవహరించి ఇప్పటికైనా గ్రామాల్లో లైబ్రరీ వ్యవస్థను ఏర్పాటు చేసి విద్యార్థులకు పుస్తకాల ద్వారా మంచి విజ్ఞానాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## తాసిల్దార్ కు బిజెపి నాయకుల వినతిపత్రం



**జవహర్ నగర్ (ప్రశ్న న్యూస్)** జవహర్ నగర్ బిజెపి అధ్యక్షులు కళికోట కమలాకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలులో వైఫల్యాన్ని నిరసిస్తూ కాప్రా ఎమ్మార్వోకు సోమవారం వినతి పత్రం సమర్పించడం జరుగింది ఈ సందర్భంగా కమలాకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు రామచంద్రరావు మేడ్చల్ జిల్లా రూరల్ బిజెపి అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్ ల పిలుపుమేరకు వినతి పత్రం తహసిల్దార్ కు అందజేయడం జరిగిందని విన్నవిస్తూ ఎన్నికల ముందు ఆకాశమే హద్దుగా హామీలు ఇచ్చి, అధికారం దక్కగానే ప్రజల నమ్మకాలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండిస్తున్నాం అన్నారు100 రోజుల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తాం అని ప్రగల్భాలు పలికిన ఆరు గ్యారంటీలు నేడు రెండు సంవత్సరాలు గడిచినా పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోకపోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు మహాలక్ష్మి పథకం కింద ప్రతి నెలా రూ 2,500 ఇస్తామని చెప్పి నేటికీ ఆ ఊసే ఎత్తకపోవడం మహిళలను మోసం చేశారని విమర్శించారు ఎకరాకు రూ 15,000 చొప్పున పెట్టుబడి సాయం అందిస్తామని రైతులను నమ్మించి, పాత పథకాలను కూడా సరిగా అమలు చేయలేదని ఐదు లక్షల విద్యార్థులకు భరోసా కార్డులు, నిరుద్యోగ భృతి వంటి హామీలు కేవలం కాగితాలకే పరిమితం అయ్యాయని 500 రూపాయలకే సిలిండర్ మరియు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాలు అరకొరగా అమలు చేస్తూ, నిబంధనల పేరుతో లక్షలాది మంది అర్హులను జాబితా నుండి తొలగించడం దారుణం అన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ఆర్థిక ఇబ్బందుల నెపాన్ని గత ప్రభుత్వంపై నెట్టడం హాస్యాస్పదం అని ఎద్దేవ చేశారు హామీలు ఇచ్చేముందు లేని ఆర్థిక అవగాహన ఇప్పుడు ఎందుకు తలెత్తిందో ముఖ్యమంత్రి ప్రజలకు సమాధానం చెప్పాలని తక్షణమే పెండింగ్‌లో ఉన్న అన్ని గ్యారంటీలను బేషరతుగా అమలు చేయాలని, లేనిపక్షంలో ప్రజల పక్షాన భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు ఈకార్యక్రమంలో రాష్ట్ర బీజేవైఎం నాయకులు సంతోష్ గుప్తా, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు మహేందర్ యాదవ్, జిల్లా దళిత మోర్చా ఉపాధ్యక్షులు మరాఠి బాబు, జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు లిఖిత యాదవ్, మాజీ కార్పొరేటర్ పానుగంటి బాబు, జవహార్ నగర్ మాజీ బీజేవైఎం అధ్యక్షులు రామ్ నాయక్, బిజెపి ఉపాధ్యక్షురాలు వనబోజు రాజేశ్వరి, ప్రధాన కార్యదర్శులు వేపుల సన్నీ, ముచ్చర్ల యాదగిరి , బీజేవైఎం అధ్యక్షులు సందీప్ ముదిరాజ్, కిసాన్ మోర్చా అధ్యక్షులు కొంపెల్ల చంద్రశేఖర్, మహిళా మోర్చా అధ్యక్షురాలు చింతంరెడ్డి లక్ష్మీ దేవి, పానుగంటి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పరిశుభ్రతకు కృషి చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలు సేవలు అభినందనీయం

- గంగాధర గ్రామ సర్పంచ్ :. పడాల భాగ్యలక్ష్మి - రాజన్న
- ప్రజా పాలన -. ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామ పంచాయతీ సిబ్బందికి ఘన సత్కారం



గంగాధర (ప్రశ్న న్యూస్ ) ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ జిల్లా,గంగాధర మండలంలోని గంగాధర గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం గ్రామ పంచాయతీ సిబ్బందికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామాన్ని శుభ్రంగా ఉంచడంలో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తున్న పంచాయతీ కార్యదర్శి,పారిశుధ్య కార్మికులు,వాటర్ మెన్లను సర్పంచ్ పడాల భాగ్యలక్ష్మి – రాజన్న ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా సర్పంచ్ పడాల భాగ్యలక్ష్మి – రాజన్న మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో పంచాయతీ సిబ్బంది సేవలు ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఎండ, వాన తేడా లేకుండా గ్రామ పారిశుద్ధ్యాన్ని కాపాడుతూ ప్రజలకు సేవలు అందిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల కృషి అభినందనీయమని తెలిపారు. వారి సేవలకు గౌరవ సూచకంగా శాలువాలు కప్పి సత్కరించడంతో పాటు అవసరమైన సానిటేషన్ సామగ్రిని అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, పంచాయతీ వార్డు సభ్యులు,గ్రామ పెద్దలు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగానికి ప్రాధాన్యత కల్పించాలి

-బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలి

- ఏ.ఐ.ఎస్.బి.రాష్ట్ర ఉపాధ్యక్షులు : అతికం రాజశేఖర్ గౌడ్



కరీంనగర్ (ప్రశ్న న్యూస్ )తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి ప్రాధాన్యత కల్పిస్తూ,కనీసం 30 శాతం నిధులు కేటాయించాలని ఏ.ఐ.ఎస్.బి.రాష్ట్ర ఉపాధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగాఅయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో విద్యా వ్యవస్థ అభివృద్ధి చెందాలంటే బడ్జెట్‌లో తగినంత నిధులు కేటాయించడం అత్యంత అవసరమని అన్నారు. విద్యకు 30 శాతం నిధులు కేటాయిస్తేనే ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు మరింత అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు.విద్యాభివృద్ధి కోసం పెద్దఎత్తున హామీలు ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం వాటిని అమలు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని, కేవలం మాటలకే పరిమితం కాకుండా బడ్జెట్‌లో సరిపడా నిధులు కేటాయించి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ఆయన సూచించారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా భారీ స్థాయిలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వంశీ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల విశ్వాసానికి ప్రతీక వెంకట సాయి నగర్ అధ్యక్షుడుగా విజయేందర్ రెడ్డి ఏకగ్రీవం

- అభివృద్ధి పనులతో ప్రజల మనసు గెలుచుకున్న విజయేందర్ రెడ్డి
- పార్టీలకతీతంగా కాలనీ అభివృద్ధి చేస్తా, కాలనీ సమస్యల పై పరిష్కారానికి కృషి చేస్తా



**ఉప్పల్ (ప్రశ్న న్యూస్)** రామంతాపూర్ బగాయత్ వెంకట సాయి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా జర్నలిస్టు విజయేందర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఆదివారం నిర్వహించిన నామినేషన్ ప్రక్రియలో అధ్యక్ష పదవికి విజయేందర్ రెడ్డి ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల కమిటీ ప్రకటించింది.కాలనీ అభివృద్ధికి గతంలో చేసిన సేవలను గుర్తించి కాలనీ వాసులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఎన్నికైనట్లు ప్రకటించగానే కాలనీలో సంబరాలు జరిగాయి. స్థానిక ప్రజలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని అభినందనలు తెలిపారు.కాలనీలో మౌలిక వసతుల అభివృద్ధికి విజయేందర్ రెడ్డి చేసిన కృషి ఫలితంగానే ఆయనకు ఈ గౌరవం దక్కిందని కాలనీ వాసులు తెలిపారు.ప్రత్యేకంగా కాలనీలో జీవో ఆర్.టి నెంబర్: 445 ద్వారా ఇంటి నెంబర్ల కేటాయింపు, డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు, సిసి రోడ్ల నిర్మాణం, బాక్స్ కల్వర్టు పనులు చేపట్టడం వంటి కార్యక్రమాలను ఆయన ముందుండి పూర్తి చేయించారు.అదే విధంగా వీధి లైట్ల ఏర్పాటు, ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు, త్రీఫేస్ విద్యుత్ లైన్ ఏర్పాటు వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయించడంలో కీలక పాత్ర పోషించారు.కాలనీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న నాయకుడిగా విజయేందర్ రెడ్డికి మంచి గుర్తింపు ఉందని స్థానికులు పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా కాలనీ అభివృద్ధికి ఆయన చేస్తున్న కార్యక్రమాలకు మా పూర్తి మద్దతు ఉంటుంది.పార్టీలకు అతీతంగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న నాయకుడు. కాలనీలో మౌలిక వసతుల అభివృద్ధికి ఆయన తీసుకున్న చర్యలు ప్రశంసనీయం.విజయేందర్ రెడ్డి నాయకత్వంలో వెంకట సాయి నగర్ కాలనీ అభివృద్ధి చెందుతుందని నమ్మకం ఉంది. కాలనీ ప్రజలందరినీ కలుపుకొని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న ఆయనకు మేమంతా సహకారం అందిస్తాము అందిస్తామని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు.

# నమో నమో నారాయణే..



ప్రసిద్ధ దేవాలయాలు, నేలమాళిగలు, నిధి నిక్షేపాలు.. తదితర అంశాల మేళవింపుగా రూపొందుతున్న పానిండియా మైథలాజికల్ యాక్షన్ అడ్వెంచర్ 'నాగబంధం'. విరాట్‌కర్ణ హీరోగా అభిషేక్ నామా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రానికి కిశోర్ అన్నపురెడ్డి, నిషితా నాగిరెడ్డి నిర్మాతలు. నిర్మాణ దశలో ఉన్న ఈ సినిమా వేసవిలో విడుదల కానుంది. ప్రచారంలో భాగంగా 'నమోరే.. నమో నమోరే.. నమో నమో నారాయణే..' అంటూ సాగే భక్తిరసాత్మక గీతాన్ని మేకర్స్ ఆదివారం విడుదల చేశారు. ఆధ్యాత్మికత, కళాత్మకత ప్రతిబింబించేలా ఈ పాట రూపొందింది. విష్ణుదేవుని స్తుతిగా తయారైన ఈ గీతాన్ని శ్రీహర్ష ఈమని రాయగా, జునైద్‌కుమార్, అభే స్వరపరిచారు. సింధూజా శ్రీనివాసన్, ఐశ్వర్య దారూరి ఆలపించారు. గణేశ్ ఆచార్య, శ్రేష్టి వర్మ కొరియోగ్రఫీ అందించారు.

రెండువేలమంది నర్తకీమణులు ఈ పాటలో భాగమయ్యారు. నభా నటేష్, దక్ష నగార్కర్ హావభావాలు, నాట్యవిన్యాసాలు పాటకు ఆకర్షణగా నిలిచాయి. తిరువనంతపురం పద్మనాభస్వామి ఆలయాన్ని తలపించేలా కళాదర్శకుడు అశోక్‌కుమార్ వేసిన సెట్ పాటకు నిండుదనాన్ని తెచ్చింది. ఈ చిత్రానికి నిర్మాణం: NIK స్టూడియోస్, అభిషేక్ పిక్చర్స్.

# కొత్తింట్లో చేరిన 'దంగల్' నటి



'దంగల్', 'మిసెస్' వంటి చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ నటి సాన్యా మల్హోత్రా తన సొంతింటి కలను నెరవేర్చుకున్నారు. ముంబైలో కొనుగోలు చేసిన కొత్త ఇంట్లో ఆమె శనివారం గృహప్రవేశ పూజను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు సంబంధించిన ఫోటోలను తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పంచుకున్నారు. ఈ పూజా కార్యక్రమాల్లో సాన్యా గులాబీ రంగు చీరలో, వెండి ఆభరణాలతో సంప్రదాయబద్ధంగా కనిపించారు. ఆమె తల్లిదండ్రులు, సన్నిహితులు ఈ వేడుకలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాన్యా ఓ భావోద్వేగ సందేశాన్ని పంచుకున్నారు. "సంవత్సరాల కలలు, కృషి, ఎదుగుదల ఫలితమే ఈ ఇల్లు. ఓర్పు, నమ్మకం యొక్క ఫలం ఎంత అందంగా ఉంటుందో ఈ ఇంటి ప్రతీ గోడ నాకు గుర్తుచేస్తుంది. నా ఈ ప్రయాణంలో నా కుటుంబం, స్నేహితుల నమ్మకమే నాకు అతిపెద్ద బలం. ఇది కేవలం ఇల్లు కాదు, నా ప్రయాణంలో ఒక చిన్న భాగం" అని ఆమె పేర్కొన్నారు. ఇక సాన్యా సినిమాల విషయానికొస్తే, ప్రస్తుతం అనురాగ్ కశ్యప్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'బందర్' చిత్రంలో ఆమె కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇందులో ఆమె తొలిసారిగా నటుడు బాబీ డియోల్‌తో స్క్రీన్ షేర్ చేసుకోనున్నారు. వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందిన ఈ సినిమా 2025 టొరంటో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శితమైంది. మే 22న ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది. దీంతో పాటు, రాజ్‌కుమార్ రావు సరసన 'టోస్టర్' అనే మరో కామెడీ చిత్రంలో కూడా ఆమె నటిస్తున్నారు.



# పండంటి బిడ్డకు జన్మనిచ్చిన సినీ నటి పూర్ణ

టాలీవుడ్ నటి, 'ఢీ' ఫేమ్ పూర్ణ (షామ్నా ఖాసిమ్) తన అభిమానులతో ఒక సంతోషకరమైన వార్తను పంచుకున్నారు. ఆమె రెండోసారి తల్లి అయ్యారు. ఈ ఉదయం 4.25 గంటలకు ఒక పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చినట్లు సోషల్ మీడియా వేదికగా ఆమె ప్రకటించారు. తన జీవితంలోకి వచ్చిన ఈ చిన్నారి అపురూపమైన కానుక అని, ఎటువంటి ఇబ్బందులు లేకుండా డెలివరీ సాఫీగా జరిగినందుకు దేవుడికి, ఆసుపత్రి సిబ్బందికి పూర్ణ తన కృతజ్ఞతలు తెలిపారు. పూర్ణకు 2022లో దుబాయ్ వ్యాపారవేత్త షానిద్ ఆసిఫ్ అలీతో వివాహం జరిగింది. వీరికి 2023లో బాబు హమ్దాన్ జన్మించాడు. ఇప్పుడు మరోసారి తల్లి అయినట్టు పూర్ణ తీపి కబురు అందించారు. ఈ సందర్భంగా సినీ తారలు, అభిమానులు పూర్ణ దంపతులకు సోషల్ మీడియా వేదికగా అభినందనలు తెలుపుతున్నారు.

# తనకు నటన రాదని చెప్పాను





తండ్రి అంచనాలను తల్లకిందులు చేయడమే కాకుండా, తండ్రికి కావాల్సినంత పుత్రికోత్సాహాన్ని కూడా అందించింది మలయాళ మందారం కల్యాణి ప్రియదర్శన్. మలయాళ దిగ్దర్శకుడు ప్రియదర్శన్ గారాలపట్టి అయిన కల్యాణికి, అసలు యాక్ట్రస్ అవ్వాలనే ఆలోచనే లేదట. ఆర్కిటెక్ట్ కావాలనేది ఆమె డ్రీమ్ అట. అయితే.. అనుకోకుండా నటిగా మారింది. అంతేకాదు, తానే ప్రధాన పాత్రగా రూపొందిన లేడీ ఓరియెంటెడ్ థ్రిల్లర్ 'కొత్త లోక'తో బాక్సాఫీస్ వద్ద సన్సేషన్ క్రియేట్ చేసి, దాదాపు 300కోట్ల వసూళ్లను కొల్లగొట్టింది. దక్షిణాదిన ఓ లేడీ ఓరియెంటెడ్ సినిమాకు ఈ స్థాయిలో వసూళ్లు రావడం ఓ రికార్డ్. మరో ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. కల్యాణి నటిగా మారింది తెలుగు సినిమాతోనే. అది ఎలా జరిగిందో ప్రియదర్శన్ చెబుతూ 'కల్యాణి సినిమాల్లో రాణిస్తుందని నేనస్సలు అనుకోలేదు. సెట్స్‌కి రావడానికి కూడా తను ఇష్టపడేది కాదు. కేరళంలో పెరగకపోవడంతో తనకు మలయాళం కూడా సరిగ్గా రాదు.

ఆర్కిటెక్ట్ కావడం ఆమె గోల్. అయితే.. ఓ రోజు అక్కినేని నాగార్జున నాకు కాల్ చేశారు. తన కుమారుడు అఖిల్ హీరోగా రూపొందుతున్న 'హలో' సినిమాలో హీరోయిన్‌గా కల్యాణిని అడిగారు. తనకు నటన రాదని కరాఖండీగా చెప్పేశాను. అయితే.. కల్యాణి మాత్రం చేస్తానంది. 'ఒక్కసారి ట్రై చేస్తా నాన్నా.. పోయేదేముంది.. కుదరకపోతే ఆర్కిటెక్ట్‌గా నా ప్రయత్నాలు నాకెలాగూ ఉన్నాయికదా..' అని నచ్చజెప్పింది. దాంతో తప్పక ఒప్పుకున్నా. కానీ నా అంచనాలు తారుమారు చేస్తూ పెద్ద స్టార్‌గా ఎదిగింది. ఈ విషయంలో నా కూతుర్ని చూస్తుంటే గర్వంగా ఉంటుంది' అన్నారు ప్రియదర్శిన్.

## ఉత్కంఠభరితంగా

# సుయోధన

'ఇదొక సైకలాజికల్ థ్రిల్లర్. కథలోని సుయోధన క్యారెక్టర్ కోసం మేమంతా ఏకగ్రీవంగా అనుకున్న పేరు సాయికుమార్. ఒక మనిషి సుయోధన, దుర్యోధన అని ఎందుకు పిలవబడతాడు అనేదే ఈ కథలో ఆసక్తికరమైన పాయింట్' అని హీరో ప్రియదర్శి అన్నారు. ఆయన నటించిన సైకలాజికల్ థ్రిల్లర్ 'సుయోధన'. థ్రిషిక చందర్ కథానాయిక. సాయికుమార్, ప్రేమ కీలక పాత్రధారులు. వైఎస్ మాధవరెడ్డి దర్శకుడు. బోసుబాబు నిడుమోలు నిర్మాత.(నిర్మాణం పూర్తి చేసుకున్న ఈ సినిమా ఈ నెల 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన టీజర్ రిలీజ్ ఈవెంట్‌లో ప్రియదర్శి మాట్లాడారు. ఇదొక విభిన్నమైన కాన్సెప్టని దర్శకుడు వైఎస్ మాధవరెడ్డి చెప్పారు. ఈ సినిమాలో నటించిన తమకే ఈ సినిమా చూస్తున్నప్పుడు నెక్ట్స్ ఏంటి అనే క్యూరియాసిటీ కలిగిందని సాయికుమార్ నమ్మకంగా చెప్పారు. ఇంకా చిత్ర బృందమంతా మాట్లాడారు.



# ప్రేమలోని ఆంతర్యాన్ని తెలిపేలా



'కమిటీ కుర్రోళ్లు' చిత్రంతో నిర్మాతగా తన అభిరుచిని చాటిన నిహారిక కొణిదెల.. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ పతాకంపై ఉమేష్ కుమార్ బన్సాల్‌తో కలిసి నిర్మించిన చిత్రం 'రాకాస'. సంగీత్‌శోభన్, నయన్ సారిక జంటగా నటించారు. మానసశర్మ దర్శకత్వం వహించారు. ఏప్రిల్ 3న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా మ్యూజికల్ ప్రమోషన్స్ మొదలుపెట్టారు. ఇందులో భాగంగా ఈ సినిమా నుంచి 'పదే పదే..' అంటూ సాగే పాటని హైదరాబాద్‌లోని సెయింట్ పీటర్ ఇంజనీరింగ్ కాలేజ్‌లో విద్యార్థుల సమక్షంలో రిలీజ్ చేశారు. ప్రేమకై ప్రాధేయపడకూడదని, మనమే ప్రేమలా మారిపోవాలని, అదే ఈ పాటలోని ఆంతర్యమని నిహారిక చెప్పారు. ఇంకా సంగీత్ శోభన్, నయన్ సారిక, సంగీత దర్శకుడు అనుదీప్ దేవ్ కూడా మాట్లాడారు.

# అటెండర్ విద్యార్థినిపై లైంగిక దాడి,

## నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

## ఐదుగురు సాక్షులను విచారించిన న్యాయస్థానం

## జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు,




మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) మెదక్ జిల్లా రేగోడ్ మండలంలో చిన్నారి పై జరిగిన లైంగిక దాడి కేసులో మెదక్ ఫాస్ట్ ట్రాక్ పోక్సో కోర్టు కీలక తీర్పు వెలువరించింది. పాఠశాలలో అటెండర్‌గా పనిచేస్తున్న వ్యక్తి జూన్ 2019లో విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించినట్లు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు.

నిందితుడు సారా జైపాల్ (25) పాఠశాలలో అటెండర్‌గా పనిచేస్తూ అక్కడ చదువుతున్న విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా, విచారణ అనంతరం కోర్టు నిందితుడిని దోషిగా నిర్ధారించింది. ఈ కేసును విచారించిన మెదక్ ఫాస్ట్ ట్రాక్ పోక్సో కోర్టు న్యాయమూర్తి శ్రీమతి ఆర్.ఎం. సుభావల్లి నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించడంతో పాటు బాధితురాలికి రూ.1 లక్ష పరిహారం చెల్లించాలని ఆదేశించారు. ఈ కేసు ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రం సెక్సువల్ అఫెన్సెస్ (పోక్సో) చట్టం -- 2012 కింద విచారణ జరిగింది. ఈ కేసులో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం. బాలయ్య కేసును సమర్థవంతంగా వాదించి నిందితుడికి శిక్ష పడేలా కీలక పాత్ర పోషించారు. భరోసా లీగల్ ఆఫీసర్ అడ్వకేట్ కె. శ్వేత బాధితురాలికి మరియు సాక్షులకు న్యాయ సహాయం అందించారు. రేగోడ్ ఎస్ఐ ఎం. కాశినాథ్ కేసు నమోదు చేయగా, సర్కిల్ ఇన్స్పెక్టర్లు కె. రవీందర్ రెడ్డి, ఎం. జార్జ్ దర్యాప్తు నిర్వహించారు. కోర్టు విచారణలో కోర్ట్ లైసోనింగ్ ఆఫీసర్ ఎస్ఐ విఠల్, పీసీ జి. కృష్ణ, కోర్టు డ్యూటీ ఆఫీసర్ ఎ. వినోద్ సహకారం అందించారు. పిల్లలపై లైంగిక దాడి అత్యంత ఘోర నేరమని, ముఖ్యంగా పాఠశాలల వంటి సురక్షిత ప్రదేశాల్లో పిల్లలపై నేరాలకు పాల్పడే వారిని చట్టం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించదని, ఇటువంటి నేరాలకు పాల్పడిన వారిపై చట్టం కఠినంగా వ్యవహరిస్తుందని జిల్లా ఎస్పీ తెలిపారు.

# హోటల్ యజమానులకు తీరని గ్యాస్ కష్టాలు

## గ్యాస్ అధిక ధరలు పెరగడంతో కట్టెలపైనే వంటలు



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) మెదక్ జిల్లా వ్యాప్తంగా హోటలు, రెస్టారెంట్, టిఫిన్ సెంటర్లు ఫాస్ట్ ఫుడ్ సెంటర్లకు టీ స్టాల్ లకు తీరని గ్యాస్ కష్టాలు గ్యాస్ అధిక ధరలు పెరగడంతో కట్టెలపైని వంటలు చేస్తున్నారు రెస్టారెంట్ లో బిర్యానీ ధర 150 ఉంటే 180 రూపాయలకు విక్రయిస్తున్నారు ఫాస్ట్ ఫుడ్ సెంటర్లో నూడిల్స్ మంచూరియా, ఎగ్ రైస్ ధర 60 రూపాయలకు ఉంటే 80 రూపాయలకు పెంచడం జరిగిందన్నారు ఇడ్లీ వడ దోశ పూరి 40 రూపాయలకు ఉంటే 60 రూపాయలకు పెంచారు వినియోగదారులు ఇదేంటి అని ప్రశ్నిస్తే గ్యాస్ ధరలు అధికంగా పెరగడంతో మేము కూడా రేట్లు పెంచడం జరిగిందన్నారు, హోటల్ యజమానులు అధిక ధరలు పెంచడంతో వినియోగదారులు లబోదిబోమంటున్నారు ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం స్పందించి గ్యాస్ ధరలను తగ్గించాలని హోటల్, రెస్టారెంట్,టిఫిన్ సెంటర్ల, యాజమాన్యలు విజ్ఞప్తి చేశారు, గ్యాస్ ధరలు పెరగడంతో కస్టమర్లు రాకపోవడంతో భారీగా నష్టపోతున్నామని పొతంశెట్టిపల్లి హోటల్ యాజమాన్యం ఫాస్ట్ ఫుడ్ అయాన్ చికెన్ సెంటర్ ఎండి యునాస్ ఖాన్, టిఫిన్ సెంటర్ నాగరాజు, తాటి బెల్లం శివ, టీ స్టాల్ మహేష్, హోటల్ సాంబ శివ, ఫుడ్ కోర్ట్ అరె రవీందర్, జెడిబి చికెన్ సెంటర్ పశుపతి, గ్యాస్ అధిక ధరలు తగ్గించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# వైభవంగా శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి

# కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న

## మాజీ డిప్యూటీ స్పీకర్, యం . పద్మ దేవేందర్ రెడ్డి .



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) మెదక్ జిల్లా శంకరంపేట ఆర్ మండలం భగీరథపల్లి గ్రామంలో సోమవారం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవంలో సోమవారం మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు యం.పద్మ దేవేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మదేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సూళ్ల సావిత్రి పోచయ్య తాజా మాజీ సర్పంచ్ దయాకర్ యాదవ్, మాజీ మండల రైతు సమన్వయ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, సర్పంచ్ లు చిలుక నాగరాజు, ఇమ్మడి నరేష్, మండల నాయకులు పూలపల్లి యాదగిరి యాదవ్, మహిపాల్ రెడ్డి, గౌండస్వామి, బందెల ప్రభాకర్, యేమ చంద్రం, పాండు యాదవ్, పోతరాజు రాజు, తదితరులు పాల్గొన్నారు.

# అందరికి జై జనసేన



నిజామాబాద్ (ప్రశ్న న్యూస్) జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ రెండు తెలుగు రాష్ట్రాల పార్టీ నాయకులకి తోటి జనసైనికులకు వీర మహిళల కు పార్టీ శ్రేణులకు అభిమానులకు జనసేన పార్టీ13 ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలంగాణలో రాష్ట్ర నాయకులకి జిల్లా నాయకులకి నిజామాబాద్ రూరల్ నాయకులు జనసేన పార్టీ విరామహిళలకి నిజామాబాదు కోఆర్డినేటర్ మచ్చ సుధాకర్ డిస్పాచెడ్ ఆఫీస్ ప్రారంభించారు. ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలొ కొత్త కొండ రాజేశ్వర్ జనసేన పార్టీ రూరల్ నాయకులు పాల్గొన్నారు. జిల్లా మండల గ్రామాలలో కూడా పార్టీ బలోపేతం చెయ్యాలి అని అన్నారు. అందరికి జై జనసేన.

# ఎన్నికల హామీల అమలుకు బీజేపీ డిమాండ్

## - తహసీల్దార్ కు మెమోరాండం అందజేత



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్ )రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలో భారతీయ జనతా పార్టీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వ హామీల అమలుకు డిమాండ్ చేస్తూ సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ సూచనల మేరకు బోయిని పల్లి మండల శాఖ ఆధ్వర్యంలో మండల అధ్యక్షులు ఎడపల్లి పరశురామ్ నాయకత్వంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ కరీంనగర్ జిల్లా కోశాధికారి వైద రామానుజం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలు కాకపోవడం బాధాకరమన్నారు. యువతకు జాబ్ క్యాలెండర్ ప్రకటించడం, నిరుద్యోగ భృతి అందించడం, రైతులకు రైతు భరోసా అమలు చేయడం, అర్హులైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెన్షన్లు మంజూరు చేయడం, పేదలకు ఇళ్ల పథకం అమలు చేయడం వంటి హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

మండలంలోని రైతులు, పేద ప్రజలు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. భూభారతి రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు ఇచ్చిన దరఖాస్తులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. అలాగే నివాస, ఆదాయ, కుల ధృవీకరణ పత్రాల జారీలో జరుగుతున్న జాప్యాన్ని నివారించి ప్రజలకు త్వరగా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి మండల ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని బీజేపీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ప్రజల హక్కుల పరిరక్షణ కోసం భారతీయ జనతా పార్టీ ఎప్పుడూ ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, పసికంటి వెంకటేశం, కొనుకటి హరీష్, మెరుపుల గంగాధర్, రమేష్, సారంపల్లి రాజు, కిరణ్, భాస్కర్ రెడ్డి, మహేష్, అనిల్, రజనీకాంత్, అంజయ్య, రాజు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంగన్వాడి ఉద్యోగుల అక్రమ అరెస్టులను

# ఖండించిన సిఐటియు జిల్లా కమిటీ

## సమస్యలు పరిష్కరించకుండా అరెస్టులు చేస్తారా ఇదేం న్యాయం

మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) అంగన్వాడి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా అరెస్టులు చేస్తుందని సిఐటీయు జిల్లా కమిటీ ఖండించింది. అంగన్వాడి ఉద్యోగుల సమస్యల పై అసెంబ్లీ సమావేశాలలో మాట్లాడాలని,పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతూ సోమవారం ఇందిరా పార్కు దగ్గర జరిగే ధర్నా లో పాల్గొనడానికి వెళ్తున్న అంగన్వాడి ఉద్యోగులను ఒకరోజు ముందు నుండి,ధర్నాకు వెళ్తున్న దారిలోనే అక్రమంగా అరెస్టు చేసి హైదరాబాద్ లోని అన్ని పోలీసు స్టేషన్ల లో పెట్టడం అన్యాయ మని అరెస్టులను ఖండించింది. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరడం కూడా తప్పేనా అని మండిపడ్డారు. ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాలలో అంగన్వాడి సమస్యల పై చర్చించాలని,లేకపోతే దీర్ఘ కాల పోరాటాన్ని ఉదృతం చేస్తామని జిల్లా కమిటీ హెచ్చరించింది.

# సమయపాలన పాటించాలని

# అధికారులకు ఆదేశం

## ప్రజావాణి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి

## కలెక్టర్ ఇలా త్రిపాఠి



నిజామాబాద్(ప్రశ్న న్యూస్) ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ, ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, ఇంచార్జి అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, డీఆర్డీఓ సాయగౌడ్, ఆర్డీఓ రాజేంద్ర కుమార్, బోధన్ ఏ.సీ.పీ శ్రీనివాస్ లతో కలిసి కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రజావాణి ఫిర్యాదులు స్వీకరించారు. 80 వినతులు అందగా, వాటి పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు అందించారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయవద్దని సూచించారు. ఇదిలాఉండగా, ప్రజావాణి కార్యక్రమానికి పలువురు అధికారులు కొంత ఆలస్యంగా హాజరు కావడాన్ని గమనించిన కలెక్టర్, ప్రతి ఒక్కరు విధిగా సమయ పాలన పాటించాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమం ప్రారంభం అయ్యే నిర్ణీత సమయం ఉదయం 10.30 గంటల వరకు అధికారులు అందరూ హాజరు అయి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా

# పోలీస్ స్టేషన్లలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం

## - పోలీస్ కమిషనర్ వెల్లడి






నిజామాబాద్(ప్రశ్న న్యూస్) నిజామాబాదు జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' లో భాగంగా నేడు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, ఆదేశానుసారముగా నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్ , ఆర్మూర్ , బోధన్ డివిజన్ పరిధిలో గల అన్ని పోలీస్ స్టేషన్ లలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహిశీచారు. ఇట్టి పరిసరాల పరిశుభ్రత కార్యక్రమంలో సంబంధిత పోలీస్ స్టేషన్ , సర్కిల్ కార్యాలయం ,ఏసిపి కార్యాలయంలో సంబంధిత అధికారులు , తోటి సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

## మహిళలు రాజకీయంగా ఆర్థికంగా ఎదగాలి



ఉప్పల్ (ప్రశ్న న్యూస్ ) ఆల్ ఇండియా శ్రీ విరాట్ విశ్వకర్మ ఉమెన్ అండ్ యూత్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రామంతపూర్ డివిజన్ కామాక్షిపురం కమిటీ హాల్ లో నమ్మోజు నాగలక్ష్మి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలకు బిజెపి పార్టీ రామంతపూర్ డివిజన్ పూర్వ కార్పొరేటర్ బండారి శ్రీవాణి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మహిళలకు వివిధ పోటీ కార్యక్రమాలు నిర్వహించగా, అంగన్వాడీ టీచర్లు, అంగన్వాడి ఆయమ్మలు, ఆశా వర్కర్లు, ఆర్పీలను వారి సేవలను గుర్తించి సన్మానించారు. పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని చిన్నారి భరతనాట్య ప్రదర్శనతో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆకారపు శరణ్య, గడ్డం భవాని, బీజేపీ సీనియర్ నాయకుడు వెంకన్న, సురేష్ రెడ్డి (జనసేన రాష్ట్ర నాయకులు), ఏఐవిఎఫ్ జాతీయ వ్యవస్థాపకులు జైన్ కుమార్ విశ్వకర్మ, అంబర్ పేట డివిజన్ మహిళా అధ్యక్షురాలు తెలంగాణ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కే స్వాతి ,కె.రేఖ విచ్చేశారు. ఈ సందర్భంగా మహిళా వింగ్ రాష్ట్ర ఉపాధ్యక్షులురామంతపూర్ డివిజన్ మహిళా వింగ్ అధ్యక్షులు ఎన్. నాగలక్ష్మి మాట్లాడుతూ రామంతపూర్ డివిజన్‌లో మహిళల కోసం మహిళా కళ్యాణ మండపం ఏర్పాటు చేయాలని కోరారు. ఏఐవిఎఫ్ గత 7 సంవత్సరాల నుండి మహిళలను ప్రోత్సహిస్తూ వారికి చట్టసభల్లో గౌరవం దక్కాలని ఉద్దేశంతో ఏఐవిఎఫ్ పని పనిచేస్తుందని, మహిళలు రాజకీయంగా ఆర్థికంగా ఎదగాలని, మహిళలు తలుచుకుంటే సాధించాలని ఏమీ లేదని, రానున్న గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో రాజకీయ పార్టీలు మహిళలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో అవంతి ఎస్. సునీత, జి. మాధవి,ఉప్పల్ డివిజన్ అధ్యక్షురాలు కె. విజయలక్ష్మి, నోమేశ్వరి, వి సరిత, కే విజయలక్ష్మి, వి సంగీత, ఎం రమ, కే. రత్నమాల, వరలక్ష్మి, పాల్గొన్నారు.

# మెడిసిటీ వైద్య విద్యార్థులకు

# రోడ్డు భద్రతపై అవగాహన

## సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక కార్యక్రమం

## పాల్గొన్న జీడిమెట్ల ట్రాఫిక్ ఏసీపీ కె.వెంకట్ రెడ్డి,

## మేడ్చల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్




మేడ్చల్( ప్రశ్న న్యూస్)రహదారి నిబంధనలు పాటించడం కేవలం బాధ్యత మాత్రమే కాదు, అది ప్రాణ రక్షణ కవచమని సైబరాబాద్ ట్రాఫిక్ విభాగం అధికారులు స్పష్టం చేశారు. సోమవారం ఘనపూర్ గ్రామంలోని మెడిసిటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ వేదికగా విద్యార్థులకు రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జీడిమెట్ల ట్రాఫిక్ ఏసీపీ కె. వెంకట్ రెడ్డి, మేడ్చల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ లు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి యువతతో పాటు విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన కలిగి ఉండటం వల్ల అనేక ప్రాణాపాయాలను తప్పించవచ్చని వారు పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు ప్రయాణంలో సీట్ బెల్ట్ పెట్టుకోవడం వల్ల ప్రమాద తీవ్రత తగ్గుతుందన్నారు. దీంతో పాటు వాహనం నడుపుతున్నప్పుడు ఫోన్ మాట్లాడటం ప్రాణాంతకమని హెచ్చరించారు.

### దృశ్య రూపంలో విద్యార్థులకు అవగాహన :

ప్రమాదాలు ఏ విధంగా జరుగుతాయో, అజాగ్రత్త వల్ల కలిగే నష్టాలను విద్యార్థులకు అర్థమయ్యేలా లఘు చిత్రాలను ప్రదర్శించారు. అధిక వేగంతో పాటు రాంగ్ రూట్ డ్రైవింగ్ వల్ల కలిగే భీభత్సాన్ని కళ్లకు కట్టినట్లు చూపించడంతో విద్యార్థులు ఈ అంశంపై ప్రత్యేక ఆసక్తి కనబరిచారు. ఈ కార్యక్రమంలో మెడిసిటీ ఇన్‌స్టిట్యూట్ అధ్యాపకులు, వైద్యులు, భారీ సంఖ్యలో వైద్య విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

# గ్యాస్ దెబ్బకు "మార్కెట్ డమాల్"

- అక్కడ యుద్ధం,ఇక్కడ రాద్ధాంతం,పుకార్లతో పంబం గడుపు కుంటున్న దళారులు
- బోసిపోయిన బోయిన్ పల్లి మార్కెట్,గ్యాస్ సరఫరా లేక హోటల్స్ రెస్టారెంట్స్ కు భారీ షాక్ ఖరీదు దారులు లేక అల్లాడుతున్న ట్రేడర్స్,
- "యూట్యూబ్ లో"మల్లారెడ్డి మ్యారేజ్ డే "రీల్స్ చూస్తున్న టైం పాస్ చేస్తున్న ఏజెంట్లు.?
- "మార్కెట్ ఫీజు పాతాళం వైపు,మాల్ సేల్ కాక సోలోగ సేట్లు.?

కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) ప్రపంచ దేశాల్లో కొన్ని దేశాలు మధ్య యుద్ధం వాతావరణం నెలకొంది.గత నెల 2026 ఫిబ్రవరి 28న "అమెరికా, ఇజ్రాయెల్,ఇరాన్ మహానగరంలో ఆకస్మిక వైమానిక దాడులతో విరుచుకుపడింది అమెరికా.ఇరాన్ నాయకులు అలీ ఖమేనీ,ఇతర అధికారులను చంపేశారు.అదిగాక యుద్ధం భారీగా జరుగుతున్న విషయం విదితమే!కానీ అక్కడెక్కడో యుద్ధం వాతావరణం చోటుచేసుకుంటే ఇండియాలో పిడుగు పడినట్లు,మన దేశంలో"గ్యాస్ "కొరతతో ప్రజలు రోడ్లపైకి వచ్చారు.నిరసనలు,ధర్నాలు రాస్తారోకోలు నిర్వహించారు. కేంద్రం ఇప్పటికీ ఎటువంటి సమాచారం ఇవ్వకపోవడంతో మిగితా వాణిజ్య సంబంధాలు పై ఒత్తిడి పెరిగింది.మరి కొన్ని ప్రదేశాల్లో అయితే యుద్ధం ఇరాన్ లో భీకర పోరు నడుస్తుంటే,భారత దేశంలో ఇంధనం ధరలు ఆకాశాన్ని తాకుతాయి అని,అలాగే మిగిలిన నిత్యావసర వస్తువుల పై ప్రభావం చూపుతుందని దళారులు మార్కెట్ లో రేట్లు ఏకంగా పది, ఇరవై శాతం పెంచుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ నేపథ్యంలో డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో గత కొన్ని రోజులుగా "అన్నదాతలు"ఆరు నాళ్లు కష్టపడి పంటను పసిబిడ్డలా యార్డ్"కు తరలిస్తే కొన్ని రోజులుగా వ్యాపారం లేక అల్లాడుతున్న ట్రేడర్స్.ఈ విషయం తెలిసి రైతులు చెతికి వచ్చిన పంటను కొతలు పెట్టడం లేదు!మరి కొందరు అయితే పంటను మార్కెట్ కి తరలిస్తే అంతంత మాత్రమే గిట్టుబాటు ధర వస్తుందని ఆవేదన చెందుతున్నారు.మరో విషయం ఏమిటంటే బోయిన్ పల్లి మార్కెట్ లో సమస్య భిన్నంగా ఉంది.గత కొన్ని రోజులుగా వచ్చిన కూరగాయలు,సాధారణంగా నాలుగు దఫాలుగా విభజిస్తారు.మొదటిది ఇతర రాష్ట్రాలకు,రెండోవది "ట్రేడింగ్,సప్లయ్,మూడోది "త్రైయి బజార్లు,నాలుగోది హోటల్స్ రెస్టారెంట్స్ గ్యాస్ సిలిండర్లు సరఫరా లేక సమస్యలు తలెత్తడంతో కూరగాయలు కొనుగోలు చేయక ఉన్న వాటితో సర్దుకుంటూ వ్యాపారం నిర్వహిస్తున్నారు.అదిగాక ఖరీదు దారుల వద్ద లక్షల రూపాయలు బకాయిలు ఉన్నప్పటికీ,మెండి ధైర్యంతో వ్యాపారం



చేద్దాం అనుకుంటే దందా లేక మార్కెట్ గ్రౌండ్లో ఖాళీగా ఉన్న పరిస్థితిని చూసి కన్నీళ్లు పెట్టుకుందాం అంటే కళ్లల్లో నీళ్లు కూడా రాక బండ బారిపోయిన మనస్సుతో లోలోపల కుమిలిపోతున్నారు.అసలే కమీషన్ లేని సరుక మార్కెట్ కు రాక,ఖరీద్ మాల్ తో మార్కెట్ లో నానారకాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటూసమస్యలకు కేంద్ర బిందువుగా మిగులుతున్న మాకు ఆదుకునే వాళ్లు ఎవ్వరు లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు బోయిన్ పల్లి మార్కెట్ కమీషన్ ఏజెంట్లు.

**అసోసియేషన్ అధ్యక్షుడు సోమ..**

డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో ఎవ్వర్రొచ్చిన సమస్యల తోరణాలతో స్వాగతం పలికే పరిషాన్లు కోకొల్లలుగా దర్శనమిస్తారు.అదిగాక యార్డ్ లో ప్రధానంగా చెత్త,దోమలు,మరుగు దొడ్లు, మంచి నీటి సరఫరా లేక అల్లాడుతున్న కమీషన్ ఏజెంట్లు.ఎన్ని సార్లు అధికారులకు లేఖలందజేసిన చర్యలు శూన్యం అని సికింద్రాబాద్ వెజిటబుల్ కమీషన్ ఏజెంట్ల అసోసియేషన్ అధ్యక్షుడు సోమ దేవేందర్ రెడ్డి పేర్కొన్నారు.మరో విషయం ఏమిటంటే "ములిగే నక్క మీద తాటి ముంజ"పడ్డట్టు ఉంది మార్కెట్ వ్యవహారం.ఈ మధ్య బోయిన్ పల్లి మార్కెట్ లో చెత్త కుప్పలు తెప్పలుగా పేరుకుపోవడం, దోమలు ఈగలు వల్ల వివిధ రకాల రుగ్మతలకు హమాలీలు గురి అవుతున్నారు.అలాగే యార్డ్ లో రాత్రిళ్లు హామాలీలు విధులు నిర్వహించమని తెగేసి చెబుతున్నారు.ఒక వేళ రాత్రి సమయంలో డ్యూటీ కి రాకపోతే మార్కెట్ లో పరిస్థితులు చాలా భయంకరంగా ఉంటాయి. మరో రెండు రోజుల్లో చెత్త తొలగించకపోతే భవిష్యత్తు కార్యాచరణ త్వరలో ప్రకటిస్తామని హామాలీలు తెలిపారని సోమ అన్నారు.

ఒక పక్క వ్యాపారం లేక, మరోపక్క పాత పద్దులు రాక పోటీ మార్కెట్ లో వ్యాపారం కత్తి మీద సాము లా తయారైంది. ఇప్పటికైన మార్కెటింగ్ డిపార్ట్మెంట్ అధికారులు యార్డ్ లో నెలకోన్న సమస్యలకు చెక్ పెడుతే గానీ,కమీషన్ ఏజెంట్లు వ్యాపారం ముందుకు సాగదని అసోసియేషన్ కార్యదర్శి చంద్రారెడ్డి తెలిపారు.

# రెసిడెన్షియల్ పర్మిషన్, కమర్షియల్ నిర్మాణం

**అందరికీ ఇచ్చాం, ఏం చేస్తారో చేసుకోండి అన్న ధీమా**

**నోటీసులు ఇచ్చి కూల్చకుండా అధికారుల మౌనం**

హైదరాబాద్(ప్రశ్న న్యూస్) యూసుఫ్ గూడ సర్కిల్ పరిధిలో అధికారుల నిర్లక్ష్యం, బిల్డర్ల ధైర్యం కలిసి అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట లేకుండా పోతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెసిడెన్షియల్ అనుమతులు తీసుకుని కమర్షియల్ భవనాలు నిర్మించడం ఇప్పుడు సాధారణ వ్యవహారంగా మారిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.స్థానికుల సమాచారం ప్రకారం రెసిడెన్షియల్ పర్మిషన్ తీసుకుని బిల్డర్ కమర్షియల్ నిర్మాణం చేపట్టాడు. భవనంలో స్టిల్ట్ ఫ్లోర్ను పూర్తిగా వ్యాపార కార్యకలాపాలకు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. పార్కింగ్ సమస్య ఏర్పడుతుందని దీంతో కాలనీ ప్రశాంతత దెబ్బతింటుందని, ట్రాఫిక్ సమస్యలు పెరుగుతాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికే అధికారులు నోటీసులు ఇచ్చినప్పటికీ ఆ తర్వాత చర్యలు తీసుకోకుండా మౌనం వహించడం అనుమానాలకు తావిస్తోంది. నోటీసులు ఇచ్చి ఆగిపోవడం వెనుక సెటిల్మెంట్లు జరిగాయా అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాలపై కూల్చివేతలు చేయకుండా ఎందుకు ఆలస్యం చేస్తున్నారో అధికారులు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.

**అధికారులందరికీ ఇచ్చాం, ఏం చేస్తారో చేసుకోండి..**

స్థానికులు ఫిర్యాదు చేసిన అధికారులకు కావలసింది ఇచ్చాము అంటు బిల్డర్ బహిరంగంగానే ధీమా వ్యక్తం చేస్తున్నాడని



స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యాఖ్యలే అధికారుల పనితీరుపై అనుమానాలు పెంచుతున్నాయి.యూసుఫ్ గూడ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సురేష్, ఏసీపీ రమేష్, టీపీఎస్ నాయక్ల బాధ్యత రాహిత్యం వల్లే ఇలాంటి అక్రమాలు పెరుగుతున్నాయని స్థానికులు విమర్శిస్తున్నారు. పలుమార్లు ఫిర్యాదులు చేసినా



పట్టించుకోకపోవడం వెనుక అసలు కారణం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.రెసిడెన్షియల్ అనుమతులతో కమర్షియల్ భవనాలు కట్టడం చట్ట విరుద్ధమని తెలిసినా టౌన్ ప్లానింగ్ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అక్రమ నిర్మాణాన్ని వెంటనే కూల్చివేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అధికారుల మౌనమే, బిల్డర్ల కు ధైర్యంగా మారిందని యూసుఫ్ గూడలో అక్రమ నిర్మాణాలకు ఎవరు అడ్డుకట్ట వేస్తారో వేచి చూడాలి.

# ఇజ్రాయెల్ దాడులతో దద్దరిల్లిన ఇరాన్

## -అధ్యక్షుడు వాడే విమానం పేల్చివేత

టెహ్రాన్ (ప్రశ్న న్యూస్) ఇరాన్పై ఇజ్రాయెల్ మరోసారి విరుచుకుపడింది. టెహ్రాన్లోని మెహ్రాబాద్ విమానాశ్రయంలో ఇరాన్ అగ్ర నాయకత్వం ఉపయోగించే ఒక కీలక విమానాన్ని ధ్వంసం, పలు సైనిక స్థావరాలను చేసినట్లు సోమవారం ప్రకటించింది. ఈ దాడితో ఇరాన్, దాని మిత్రపక్షాల మధ్య సమన్వయం దెబ్బతింటుందని ఇజ్రాయెల్ సైన్యం (ఐడీఎఫ్) పేర్కొంది. ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని పరిమితం చేయడమే లక్ష్యంగా ఈ దాడి జరిపినట్లు తెలిపింది. ఐడీఎఫ్ ప్రకటన ప్రకారం, ధ్వంసమైన విమానం ఎయిర్బస్ ఏ340. దీనిని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, గతంలో సుప్రీం లీడర్ అలీ ఖమేనీ వంటి అగ్ర నాయకులు దేశీయ, అంతర్జాతీయ ప్రయాణాల కోసం ఉపయోగించేవారు. టెహ్రాన్లోని ఈ విమానాశ్రయంలో దేశీయ విమానాలతో పాటు ఇరాన్ వైమానిక దళానికి చెందిన సైనిక స్థావరాలు కూడా ఉన్నాయి.

ఇదే సమయంలో టెహ్రాన్, షిరాజ్, తబ్రిజ్ వంటి ఇతర నగరాల్లోని మౌలిక సదుపాయాలపై కూడా దాడులు జరిపినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. మరోవైపు, హోర్ముజ్ జలసంధిని తెరిచి ఉంచే విషయంలో అమెరికాకు మిత్రదేశాలు సాయం చేయకపోతే నాటో భవిష్యత్తు 'చాలా దారుణంగా' ఉంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ఫైనాన్షియల్ టైమ్స్ కథనం ప్రకారం, ఆదివారం ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. హోర్ముజ్ జలసంధి ద్వారా యూరప్ దేశాలు ఎక్కువగా లబ్ధి పొందుతున్నాయని, కాబట్టి అక్కడి భద్రతకు వాళ్లు కూడా బాధ్యత వహించాలని ట్రంప్ స్పష్టం చేశారు. ఉక్రెయిన్ విషయంలో అమెరికా గతంలో యూరప్కు సాయం చేసిందని, ఇప్పుడు వారు తమకు సాయం చేయాల్సిన సమయం వచ్చిందని ఆయన వాదించారు.



# ఏమిటీ అర్ధరాత్రి బదిలీలు.?

## - కేంద్ర ఎన్నికల సంఘంపై మమత ఆగ్రహం



కోల్కతా (ప్రశ్న న్యూస్) పశ్చిమ బెంగాల్లో కీలక ఉన్నతాధికారులను కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) బదిలీ చేయడంపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అర్ధరాత్రి వేళ ఈ బదిలీలు చేపట్టడంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ కనుసన్నల్లోనే ఈసీ పనిచేస్తోందని, ఇది ప్రజాస్వామ్యంపై దాడి అని ఆరోపించారు. సోమవారం అర్ధరాత్రి రాష్ట్ర చీఫ్ సెక్రటరీ నందిని చక్రవర్తి, హోం సెక్రటరీ జేపీ మీనాలతో పాటు డీజీపీ, కోల్కతా పోలీస్ కమిషనర్ను ఈసీ బదిలీ చేసింది. దీనిపై మమత ఘాటుగా స్పందించారు. "అర్ధరాత్రి ఒంటి గంటకు నాకు మెసేజ్ వచ్చింది. ఇలాంటి చర్యలు ఎప్పుడైనా చూశారా చీఫ్ సెక్రటరీ ఒక బెంగాలీ మహిళ. ఆమెను తొలగించారు. వీళ్లు బెంగాలీలకు, మహిళలకు వ్యతిరేకులు" అంటూ కేంద్రంపై మండిపడ్డారు.

గతంలో అధికారుల బదిలీకి ముందు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ముగ్గురి పేర్లతో జాబితాను ఈసీ కోరేదని, కానీ ఈసారి ఏకపక్షంగా నిర్ణయం తీసుకుందని మమత ఆరోపించారు. "ఇదేమైనా ఢిల్లీ లడ్డూ అనుకుంటున్నారా ఇది వాళ్ల జాగీరా" అని ప్రశ్నించారు. డీజీపీగా ఉన్న పీయూష్ పాండే బెంగాలీ కాదని, ఆయనను కూడా తొలగించారని గుర్తు చేశారు. బీజేపీకి అనుకూలంగా పనిచేసే వారిని మాత్రమే ఎంపిక చేసుకుంటున్నారని విమర్శించారు. వంటగ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ కోల్కతాలో నిర్వహించిన నిరసన ర్యాలీలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. "మీరు అన్నీ మార్చండి.. అయినా సరే బెంగాల్లో ప్రభుత్వం మారదు. ఇది నా మాట" అని స్పష్టం చేశారు. రాష్ట్ర మంత్రి శశి పంజా ఇంటిపై దాడి జరిగినట్లే, తన నివాసంపై కూడా దాడి చేసే అవకాశం ఉందని మమత ఆందోళన వ్యక్తం చేశారు. "ధైర్యం ఉంటే వచ్చి దాడి చేయండి. మేం ఎదుర్కొంటాం" అని సవాల్ విసిరారు. అదే సమయంలో, ప్రజలు సంయమనం పాటించాలని, రెచ్చగొట్టే చర్యలకు లొంగవద్దని సూచించారు.

## 36 ఏళ్ల నాటి రూ.500 లంచం కేసులో

# కానిస్టేబుల్కు శిక్ష తగ్గింపు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) 36 సంవత్సరాల క్రితం రూ.500 లంచం తీసుకున్న కేసులో ఒక కానిస్టేబుల్కు ట్రయల్ కోర్టు 2 సంవత్సరాల జైలు శిక్ష విధించగా, తాజాగా సుప్రీంకోర్టు ఆ శిక్షను ఏడాదికి తగ్గించింది. ఉత్తరాఖండ్కు చెందిన ఒక ఎక్సైజ్ కానిస్టేబుల్ 1990లో రూ.500 లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. ఉదమ్ సింగ్ నగర్ జిల్లాలో అతడిపై కేసు నమోదైంది. 2006లో సెషన్స్ కోర్టు అతడిని దోషిగా తేల్చి రెండేళ్ల జైలు శిక్ష విధించింది. ఆ కానిస్టేబుల్ ఈ తీర్పును సవాల్ చేస్తూ ఉత్తరాఖండ్ హైకోర్టును ఆశ్రయించాడు. ట్రయల్ కోర్టు తీర్పును 2012లో హైకోర్టు సమర్థించింది. దీనితో అతను సుప్రీంకోర్టుకు వెళ్లాడు. అతడి అప్పీలుపై జస్టిస్ పంకజ్ మిట్టల్, జస్టిస్ పీబీ పరాలేలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ట్రయల్ కోర్టు తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. అయితే ఎక్సైజ్ కానిస్టేబుల్ వయస్సును పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు శిక్షను తగ్గించింది. ప్రస్తుతం 75 ఏళ్ల వయస్సు కలిగిన ఆ వ్యక్తి ఇప్పటికే రెండు నెలలు జైల్లో గడిపినట్లు తెలిపింది. ఈ క్రమంలో ఆయన శిక్షను ఏడాదికి తగ్గిస్తూ తీర్పు ఇచ్చింది.

# డాక్టర్ నందిని సిధారెడ్డికి

## కేంద్ర సాహిత్య అకాడమీ 2025 పురస్కారం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణకు చెందిన ప్రముఖ కవి, రచయిత డాక్టర్ నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ 2025 పురస్కారం లభించడం పట్ల, సిధారెడ్డి కి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాభినందనలు తెలియజేశారు. తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చాటిన కవి నందిని సిధారెడ్డి రాసిన "అనిమేష" కవితా సంపుటికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం దక్కడం తెలంగాణకు గర్వకారణమని పేర్కొన్నారు.సిధారెడ్డి కరోనా మహమ్మారి కాలంలో ప్రపంచం ఎదుర్కొన్న సంక్షోభాలను, మానవ సంబంధాల విచ్ఛిన్నతలను చిత్రీకరించడంవల్ల తనకు సమాజంపట్ల ఉన్న నిబద్ధతను, అలాగే తనలోనున్న ఆర్ద్రతను తెలియజేస్తుందని, వారు గొప్ప మానవతావాదని అన్నారు. సిధారెడ్డి సుదీర్ఘ సాహిత్య కృషికి లభించిన గౌరవమని, తెలంగాణ మలిదశ ఉద్యమంలో అక్షరాన్ని ఆయుధంగా మలిచి ప్రజల్లో చైతన్యం నింపడంలో వారు పోషించిన పాత్ర చిరస్మరణీయమని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఆధునిక తెలుగు కవిత్వంలో నందిని సిధారెడ్డి ఎన్నో పరిశోధనాత్మక రచనలతో సాహితీ రంగానికి విశిష్ట సేవలు అందించారని, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం దక్కడం వారి సాహిత్య ప్రస్థానానికి దక్కిన గౌరవంగా ముఖ్యమంత్రి పేర్కొన్నారు. సాహితీ రంగంలో సిధారెడ్డి మరెన్నో శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588